తొలివార్త
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com
ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 149 ఆదివారం 04 - 10 - 2026 వెల : 4/- పేజీలు : 08
Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial

best deal
HEALTH & WEALTH
"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."
We create opportunities | 9640707117 (What's up only)

## ఆస్పత్రుల నిర్మాణాల్లో
# వేగం పెంచండి

- విద్య, వైద్య శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- విద్య, వైద్య శాఖలపై సీఎంవో అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు
- ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల్లో సౌకర్యాల కల్పనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు
- సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు



**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 03 :**

ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజును ఆదేశించారు.విద్య, వైద్య శాఖలపై సీఎంవో అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని - మిగతా 2 లో

## మీరు చెప్పేది మేం వింటాం
# ఇదిగో సత్యాగ్రహ వెబ్ సైట్

SATYAGRAHA

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 'సత్యాగ్రహ' పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించిన రాహుల్ గాంధీ
- దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు, ఉద్యమాలను ఏకతాటిపైకి తేవడమే లక్ష్యం
- ప్రత్యేక వెబ్‌సైట్‌లో తమ ఉద్యమ వివరాలు నమోదు చేసేందుకు అవకాశం
- ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చిన సీఎం రేవంత్

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 03 :**

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ సమస్యలపై పోరాడుతున్న వారి గొంతుకలను ఏకం చేసే లక్ష్యంతో 'సత్యాగ్రహ' పేరుతో ఒక కొత్త వేదికను ఆయన ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు.దేశవ్యాప్తంగా సత్యం అణచివేతకు గురవుతోందని, దీనికి వ్యతిరేకంగా - మిగతా 2 లో



## రాష్ట్రంలో కాంగ్రెస్
# శకం ముగిసింది

- మాజీ మంత్రి హరీశ్ రావు
- రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 03 :**

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా - మిగతా 2 లో



## అమిత్ షా
# తెలంగాణ పర్యటన రద్దు

- చివరి నిమిషంలో కీలక నిర్ణయం!
- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 03 :**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు.షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, - మిగతా 2 లో

## ఆసియా క్రీడలో
# భారత్‌కు 'డబుల్ గోల్డ్'



- హాకీలో పురుషుల స్వర్ణం కూడా భారత్ కైవసం
- ఆసియా క్రీడల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం
- ఫైనల్‌లో మలేషియాపై 5-1 తేడాతో ఘన విజయం
- తొలిసారి పురుషులు, మహిళల జట్లు రెండూ స్వర్ణం సాధించి రికార్డు
- ఈ విజయంతో లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 03 :**

ఆసియా క్రీడల హాకీలో భారత పురుషుల జట్టు పసిడి విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను 5-1 గోల్స్ తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఈ విజయంతో భారత జట్టు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టుగా నిలవడమే కాకుండా, లాస్ ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో భారత పురుషుల హాకీ జట్టుకు ఇది ఐదో స్వర్ణం కావడం విశేషం. - మిగతా 2 లో

## కెప్టెన్ స్మిత్‌ను స్వయంగా వెళ్లి
# పరామర్శించిన దుబాయ్ యువరాజు



- స్మిత్‌ను ఆస్పత్రిలో కలిసిన దుబాయ్ యువరాజు
- ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న హమ్దాన్
- స్మిత్ ధైర్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించిన యువరాజు
- స్మిత్‌తో ఫొటోలను పంచుకున్న యువరాజు
- స్మిత్‌ను చూసి యూఏఈ గర్విస్తోందని వ్యాఖ్య

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 03 :**

ప్రాణాలను లెక్కచేయకుండా విమానంలోని 174 మందిని కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. దుబాయ్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.స్మిత్‌ను కలిసిన అనంతరం యువరాజు ఆయన ధైర్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్మిత్‌పై తమకు పూర్తి గౌరవం, అభిమానం ఉన్నాయని తెలిపారు. యూఏఈ నాయకత్వం కూడా ఆయనను గర్వంగా చూస్తోందని చెప్పారు.స్మిత్ యూఏఈ విలువలకు - మిగతా 2 లో

## 114 రఫేల్ యుద్ధవిమానాల
# కొనుగోలుకు రంగం సిద్ధం

- ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి 114 యుద్ధ విమానాల ఒప్పందం ఖరారు
- రూ.3.25 లక్షల కోట్లతో ఫ్రాన్స్‌తో మరో రఫేల్ డీల్‌కు మార్గం సుగమం
- స్వదేశీ ఏఎంసీఏ ప్రాజెక్టు ఆలస్యమైతే ఇతర విమానాలనూ పరిశీలిస్తామన్న వాయుసేన



**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 03 :**

భారత వాయుసేనను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక అడుగులు వేస్తోంది. సుమారు - మిగతా 2 లో



## స్విస్ అందాలలో
# ప్రమాద ఘంటికలు

- భూతాపం కారణంగా వేగంగా కరిగిపోతున్న స్విట్జర్లాండ్‌లోని హిమనీనదాలు
- గడిచిన ఐదేళ్లలో ఏకంగా 20 శాతం మంచును కోల్పోయిన స్విస్ పర్వతాలు
- చర్యలు తీసుకోకపోతే 2100 నాటికి 90 శాతం హిమనీనదాలు కనుమరుగయ్యే ప్రమాదం

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 03 :**

స్విట్జర్లాండ్.. ఈ పేరు వినగానే మన కళ్ల ముందు మెదిలేది తెల్లని - మిగతా 2 లో

## సుప్రీం తీర్పు తర్వాతే
# మున్సిపల్ ఎన్నికలు



- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం
- బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ
- గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని విమర్శ

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 03 :**

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, - మిగతా 2 లో

## ఏపీ అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే
# విజన్‌తో ముందుకెళ్తున్నాం

- రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్
- విజయవాడలో పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభించారు
- కార్యక్రమానికి కార్పొరేట్ సీఈఓలు, యూనికార్న్ వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, ఐఐటీ డైరెక్టర్లు, ఐటీ నిపుణులు, విధాన నిర్ణేతలు హాజరయ్యారు
- విజయవాడలో పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్‌లో పాల్గొన మంత్రి లోకేశ్



**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 03 :**

ప్రపంచానికి భారత్ మోడల్‌ను చూపిద్దామని అది అమరావతి నుంచే వస్తుందని ఐటీ శాఖ మంత్రి లోకేశ్ అన్నారు. ఆ సామర్థ్యం మనకు ఉందనే విషయాన్ని ప్రపంచంతో పాటు దేశంలోని యువతకూ చెబుదామని లోకేశ్ తెలిపారు. ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి ఊతమిచ్చేలా విజయవాడలో నిర్వహించిన పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సదస్సును ఆయన ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో పాన్ ఐఐటీయన్స్, ఐఐటీ డైరెక్టర్లు, కార్పొరేట్ సీఈవోలు, యూనికార్న్ సంస్థల వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, ఐటీ నిపుణులు, విధాన నిర్ణేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. 23 క్లస్టర్స్‌లో అభివృద్ధి చెందిన దేశాలుగా అవతరించడానికి అమెరికా, యూరప్‌లకు వందేళ్లు పట్టిందని లోకేశ్ తెలిపారు. దుబాయ్ 30 ఏళ్లు, సింగపూర్ 25 ఏళ్లలో అభివృద్ధి సాధించాయని - మిగతా 2 లో



## శ్రీసిటీలో
# పేలిన బాయిలర్

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చంద్రబాబు, లోకేశ్
- శ్రీసిటీ పారిశ్రామిక వాడలో బాయిలర్ పేలి ఘోర ప్రమాదం
- ఈ దుర్ఘటనలో ఐదుగురు కార్మికుల మృతి
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి లోకేశ్ హామీ
- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 03 :**

తిరుపతి జిల్లా శ్రీసిటీలో ప్రమాదం జరిగింది. మందుల తయారు - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఇది స్వయంకృతం!



జర్మనీ పాలకపక్షం క్రిస్టియన్ డెమాక్రటిక్ యూనియన్(సీడీయూ) అధినేత, చాన్సలర్ ఫ్రెడెరిక్ మెర్జ్‌కు ఇది దుర్వార్త. ఆయనకే కాదు... దశాబ్దాలుగా జర్మనీని ఏలిన మధ్యేవాద, వామపక్షాలకు సైతం మింగుడుపడని విషయం. ఆ మాటకొస్తే యూరప్ ఖండమంతా 'కింకర్తవ్యమ'ంటూ కలవరపడుతోంది. ఉన్నట్టుండి సంభవించిన ఈ 'రాజకీయ భూకంపాన్ని' జీర్ణించుకోలేకపోతోంది. తూర్పు జర్మనీ ప్రాంతంలోని సాక్సోనీ-- అన్‌హల్ట్ రాష్ట్రంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తీవ్ర మితవాద పక్షం ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డీ) సాధించిన విజయమే వీరందరికీ నిద్రలేని రాత్రులు మిగిల్చింది. జర్మనీలోని 16 రాష్ట్రాల్లో సాక్సోనీ--అన్‌హల్ట్ ఒకటి. దాదాపు 21 లక్షల 36 వేల జనాభాగల ఈ రాష్ట్రంలో ఏఎఫ్‌డీ ఇతరచోట్లకన్నా బలంగా ఉందని అందరూ భావించినా... 83 స్థానాలున్న పార్లమెంటులో 39 స్థానాలు, 43.8 శాతం ఓట్లు సాధించి మెజారిటీ పక్షంగా అవతరిస్తుందని ఊహించలేదు. అక్కడి ప్రస్తుత పాలకపక్షం మధ్యేవాద మితవాద సీడీయూ రెండో స్థానంలోకి పోవటమే కాదు, దాని ఓట్ల శాతం 17.2కి పడిపోయింది. మిగిలిన తొమ్మిది పార్టీల తీరెలావుందో చెప్పనవసరం లేదు.రెండో ప్రపంచ యుద్ధానంతరం జర్మనీలో తీవ్ర మితవాద పక్షాలు నామమాత్రంగా ఒకటి రెండు సీట్లు గెల్చు కోవటం తప్ప ఎప్పుడూ అధికారం అంచులవరకూ రాలేదు. ఇప్పుడైనా కనీస మెజారిటీకి మూడు తక్కువొచ్చిన ఏఎఫ్‌డీని అధికారంలోకి రానిస్తారా అనే సంశయం అందరిలో ఉంది. చేతులు కలిపేందుకు వేరే పార్టీలు ముందుకు రాకున్నా, కొందరు ఎంపీలు ఫిరాయించే అవకాశం కనబడుతోంది. అన్ని పక్షాలూ అంటరాని పార్టీగా పరిగణించిన ఏఎఫ్‌డీ కొన్నేళ్లుగా జర్మనీలో తన ఉనికి చాటుకుంటోంది. కానీ సాక్సోనీ-- అన్‌హల్ట్‌లో అది వేగంగా ఎదగటాన్ని అందరూ గుర్తించారు. వలసలను వ్యతిరేకించటం మొదలుకొని అనేక అంశాల్లో దూకుడుగా పోతున్న ఆ పార్టీని జర్మనీ నిఘా విభాగం 'తీవ్ర మితవాద పక్షం'గా నిర్ధారించింది. పది రోజుల్లో మెక్లిన్‌బర్గ్ పొమెరేనియా రాష్ట్రంలో జరిగే ఎన్నికలు ఎలాంటి ఫలితాన్నిస్తాయో... మరో మూడేళ్లలో జరిగే జాతీయ ఎన్నికల నాటికి ఏమవుతుందోనని వేరే పార్టీలు వణుకుతున్నాయి.ఏఎఫ్‌డీ విజయానికి ఇతర పార్టీలు తమను తామే నిందించుకోవాలి. దశాబ్దాలుగా దేశాన్నేలినా జనం మౌలిక సమస్యల్ని పరిష్కరించటంలో, దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దటంలో అవన్నీ విఫలమయ్యాయి. వెల్లువలా వచ్చిపడే వలసలను నివారించలేకపోయాయి. గతంలో జర్మన్ డెమాక్రటిక్ రిపబ్లిక్ (జీడీఆర్)గా వామపక్షాల పాలనలో ఉన్న తూర్పు ప్రాంతం... పశ్చిమ ప్రాంతంతో పోలిస్తే అన్నివిధాలా వెనకబడి వుంది. అందువల్ల అక్కడి సమస్యలు మరిన్ని రెట్లు అధికం. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం తెచ్చిన అనిశ్చితి వీటికి అదనం. రష్యాతో అనవసర వివాదం తెచ్చుకోకూడదన్నది ఏఎఫ్‌డీ అభిప్రాయం. ఈసారి ముమ్మరంగా పోలింగ్ జరగటం, ఏఎఫ్‌డీ విజయం దీని పర్యవసానమే. మిగిలిన పార్టీలతో పోలిస్తే ఏఎఫ్‌డీ సామాజిక మాధ్యమాల్లో చురుకు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడును అన్నివిధాలా పుణికిపుచ్చుకుంది. సీడీయూనూ, ఇతర పక్షాలనూ విమర్శలతో చీల్చిచెండాడుతుంటే అటు నోట మాటలేదు.ఇన్నాళ్లూ అమెరికా అడుగుజాడల్లో నడిచి, ఉగ్రవాదంపై యుద్ధం పేరిట అది సాగించిన వృథా యుద్ధాల్లో పాలుపంచుకుని ఇతర యూరప్ దేశాలతోపాటు జర్మనీ కూడా ఆర్థికంగా కుంగిపోయింది. ఆ యుద్ధాలు తెచ్చిన సంక్షోభంతోనే పలు ముస్లిం దేశాలనుంచి వలసలు అధికమయ్యాయి. అమెరికా సలహాతో యూరప్ దేశాలు ఉక్రెయిన్‌ను ఎగదోయకుంటే రష్యాతో లడాయి ఉండేది కాదు. సాక్సోనీ--అన్‌హల్ట్ ఫలితం గమనిస్తే మెజారిటీ ప్రజలు ఆ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారనీ, అధికార సీడీయూ విధానాలపై అసంతృప్తి చెందారనీ అర్థమవుతుంది. అయితే వేరే దేశాల్లోని తీవ్ర మితవాద పక్షాల్లాగే ఏఎఫ్‌డీ కూడా పర్యావరణ విధ్వంసాన్ని అబద్ధమంటుంది. ఎల్‌జీబీటీక్యూ హక్కులకు ఆ పార్టీ పూర్తి వ్యతిరేకం. వలసలు సరేసరి. జర్మన్లకు మాత్రమే దేశం సొంతమనీ, అన్యులను రానీయొద్దనీ దాని నినాదం. నాజీ పాలనలో విద్వేషాన్నీ, మారణహోమాల్నీ చూసిన జర్మనీలో తిరిగి ఆ మాదిరి పార్టీ అందలం ఎక్కే స్థితి ఏర్పడటానికి కారణమేమిటో ఆ దేశంతోపాటు ఫ్రాన్స్, స్పెయిన్ వగైరా యూరప్ దేశాలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

## కెప్టెన్ స్మిత్‌ను స్వయంగా వెళ్లి పరామర్శించిన దుబాయ్ యువరాజు

**మొదటిపేజీ తరువాయి -** ప్రతీకగా నిలిచారని యువరాజు పేర్కొన్నారు. దయ, శాంతి, మానవ ప్రాణాలకు విలువ ఇచ్చే దేశంగా యూఏఈ నిలుస్తుందని చెప్పారు. స్మిత్‌తో మాట్లాడుతున్న ఫొటోలను యువరాజు సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆయనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న దృశ్యాలు కూడా అందులో కనిపించాయి.విమానంలో సహ పైలట్ దాడి చేయడంతో స్మిత్ తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నించిన సహ పైలట్‌ను అడ్డుకునేందుకు ఆయన గాయాలతో వీరోచితంగా పోరాడారు. అనంతరం కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లి దాడిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనలో విమానంలోని 174 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడటంలో స్మిత్ కీలక పాత్ర పోషించారు. తీవ్ర గాయాల మధ్య కూడా ఆయన చూపిన ధైర్యంపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయి.

## ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

**మొదటిపేజీ తరువాయి -** రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆస్పత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలో ప్రతీ వారం సమీక్ష నిర్వహించాలని నిర్దేశించారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేయాలన్నారు.గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని చెప్పారు. ఈ సమీక్షలో ఎంపీ వేంనరేందర్‌రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది



**మొదటిపేజీ తరువాయి -** ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు.అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

# ఏపీ అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే విజన్‌తో ముందుకెళ్తున్నాం

**మొదటిపేజీ తరువాయి -** పేర్కొన్నారు. వచ్చే పదేళ్లలో భారత్ కూడా ఆ స్థాయికి చేరుకుంటుందన్నారు. ఆ ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్ అందరికన్నా ముందుంటుందని చెప్పారు.స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 'త్రీ ఎస్' మంత్రంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు చూసేలా ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశామని, ఒప్పందాలు చేసుకోవడంతో పాటు పరిశ్రమలు వాస్తవంగా ఏర్పాటయ్యేలా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. సంస్కరణలను ప్రకటించడం మాత్రమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడం ముఖ్యమన్నారు. వ్యవసాయం, ఉద్యానవన రంగాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు."ఏపీ అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే విజన్‌తో ముందుకెళ్తున్నాం. మరో పదేళ్లలో భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుస్తుంది. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తుంది. పారిశ్రామికవేత్తలంతా ఏపీ



వైపు చూసేలా ఎకో సిస్టం అభివృద్ధి చేశాం. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. స్థిరమైన పాలనతోనే అభివృద్ధి సాధ్యమని బలంగా నమ్ముతున్నాం.అమరావతి కేంద్రంగా శాశ్వత ప్రాతిపదికన పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటు చేయనున్నట్లు సదస్సులో వెల్లడించారు. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్లతో పాన్ ఐఐటీ ఆంధ్రా ఫండ్ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో 100 ఇండస్ట్రీ రీసెర్చ్ ఛైర్స్, 100 మది సభ్యులతో గ్లోబల్ ఐఐటీ మెంటార్ నెట్‌వర్క్ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, హెల్త్‌కేర్, అగ్రిటెక్, నీటి భద్రత తదితర అంశాలపై సదస్సులో చర్చలు జరిగాయి.చంద్రబాబు 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌కు యంగ్ అండ్ డైనమిక్ హార్డ్‌వేర్ తోడైందని లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రతి 100 రోజులకు అమరావతి నిర్మాణంలో పురోగతి కనిపిస్తోందని తెలిపారు. పాన్ ఐఐటీ సదస్సుకు హాజరైన ప్రతినిధులు అమరావతి నిర్మాణ పనులను పరిశీలించాలని కోరారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా అందుబాటులోకి రానుందని వెల్లడించారు. దేశంలోని 23 ఐఐటీల పూర్వ విద్యార్థులు అమరావతి వేదికగా కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

## శ్రీసిటీలో పేలిన బాయిలర్

**మొదటిపేజీ తరువాయి -** చేసే టిల్ హెల్త్ కేర్ పరిశ్రమలో బాయిలర్ పేలి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. నైట్ షిఫ్ట్‌లో ఉన్న ఇద్దరు కార్మికులు అక్కడికక్కడమే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని తడ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ వారు చనిపోయారు.మృతి చెందిన వారిని సత్యవేడు మండలం చెరివి గ్రామానికి చెందిన చిన్న మస్తాన్(36), తమిళనాడు మాదరపాకంకు చెందిన రమేష్(40), నాయుడుకుప్పం వాసి మోహన్(20), బంగాల్‌కు చెందిన గౌరబ్ రాయ్ (36), తడకు చెందిన వాసు(38)గా గుర్తించారు. మస్తాన్, రమేష్ ఘటనాస్థలంలోనే వృతి చెందారు. ఘటనాస్థలిని తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.మాత్రల తయారీ పరిశ్రమలో బాయిలర్ పేలడంతో రాత్రి విధులు నిర్వహిస్తున్న పలువురు కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నారు. ఈ ప్రమాదంలో 12 మందికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలించారు. రెస్క్యూ టీమ్ ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టింది.తిచెందినట్లు సమాచారం.శ్రీసిటీ టిల్ హెల్త్ కేర్ పరిశ్రమలో పేలుడు ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించామని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇప్పటికే పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు చేశామన్న కలెక్టర్ బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్ రాంబాబును సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని శ్రిసిటీ ఎండీ, తిరుపతి జిల్లా ఎస్పీతో కలిసి ఆయన పరిశీలించారు. ఘటనలో ఐదుగురు చనిపోయారని చెప్పారు. మృతుల కుటుంబాలకు 50 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని చెప్పారు. శ్రిసిటీ పరిధిలో ఉన్న అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ఆడిట్ చేయిస్తామని ఎండీ రవి సన్నారెడ్డి తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రకారం భద్రతా చర్యలు చేపట్టారా లేదా అనేది పరిశీలిస్తామని ఎస్పీ సుబ్బారాయుడు చెప్పారు. శ్రీసిటీలోని ప్రైవేటు ఫ్యాక్టరీలో బాయిలర్ పేలి కార్మికులు మృతి చెందడం, మరికొందరు గాయపడటంపై సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు.

## 114 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు రంగం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి -** రూ.3.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 114 బహుళ ప్రయోజన యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన మెగా ఒప్పందాన్ని ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఖరారు చేసే అవకాశం ఉందని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వెల్లడించారు. ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.దాదాపు రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, ఇది దేశ రక్షణ రంగ చరిత్రలోనే అతిపెద్ద కొనుగోలు ఒప్పందంగా నిలుస్తుంది. ఫ్రాన్స్‌తో ప్రభుత్వాల మధ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఈ డీల్‌ను ఖరారు చేయనున్నారు. ఈ ఒప్పందం పూర్తయితే, ఇప్పటికే భారత వాయుసేన వద్ద ఉన్న 36 రఫేల్, నౌకాదళం కోసం ఆర్డర్ చేసిన 26 రఫేల్-ఎం జెట్‌లతో కలిపి మొత్తం రఫేల్ విమానాల సంఖ్య 176కి చేరుతుంది. ప్రస్తుతం ఈ భారీ ఒప్పందానికి సంబంధించి ధరల వివరాలు, ఇతర కీలక అంశాలపై చర్చలు జరుగుతున్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ తెలిపారు.వాయుసేనలో తగ్గిపోతున్న ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య ఆందోళన కలిగిస్తోందని, ఈ నేపథ్యంలో రాబోయే కొన్నేళ్లలో ఏటా కనీసం 36 నుంచి 40 విమానాలు అవసరమని ఏపీ సింగ్ స్పష్టం చేశారు. దేశ సైనిక శక్తిలో వాయుసేన సామర్థ్యం అత్యంత కీలకమని, అందుకే దాన్ని నిరంతరం పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ ప్రాముఖ్యతను వివరిస్తూ, దేశీయంగానే ఫైటర్ జెట్ ఇంజన్‌ను తయారు చేయాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తుచేశారు. "మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సైనిక శక్తిగా మారాలి. యుద్ధ సన్నద్ధతకు స్వావలంబన చాలా ముఖ్యం" అని ఆయన అన్నారు.ఒకవేళ దేశీయంగా అభివృద్ధి చేస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్యక్రమంలో జాప్యం జరిగితే, ప్రత్యామ్నాయంగా ఇతర విమానాలను పరిశీలించే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. "రష్యా మాకు SU-57 (స్టెల్త్) జెట్లను ఆఫర్ చేసింది, కానీ దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు" అని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.ఇటీవల రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, ఈ రఫేల్ ఒప్పందం ద్వారా దేశంలో రెండో ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి వీలవుతుందని, తద్వారా రక్షణ ఉత్పత్తుల స్వదేశీకరణకు మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రఫేల్ డీల్‌తో పాటే, దేశీయంగా అభివృద్ధి చేసిన తేజస్ మార్క్ 1ఏ కార్యక్రమం కూడా కొనసాగుతుందని, ప్రపంచ స్థాయి రాడార్లు, ఆయుధాలను అమర్చుతూ దాన్ని మరింత మెరుగుపరుస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఆసియా క్రీడలో భారత్‌కు 'డబుల్ గోల్డ్'

**మొదటిపేజీ తరువాయి -** జపాన్‌లోని గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆట 11వ నిమిషంలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, 14వ నిమిషంలో మలేషియా ఆటగాడు షెల్లో సిల్వేరియస్ ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ, ఆ తర్వాత భారత ఆటగాళ్లు మలేషియాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 23వ నిమిషంలో జుగరాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌తో, 42వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్స్ సాధించి భారత్‌కు 3-1 ఆధిక్యాన్ని అందించారు. చివరి క్వార్టర్‌లో మరింత దూకుడు పెంచిన భారత్, 54వ నిమిషంలో శిలానంద్ లక్రా ఫీల్డ్ గోల్, 57వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరో పెనాల్టీ కార్నర్ గోల్‌తో 5-1 తేడాతో భారీ విజయాన్ని ఖరారు చేశారు.ఈ ఆసియా క్రీడలు భారత హాకీకి చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. శుక్రవారం జరిగిన మహిళల ఫైనల్‌లో భారత జట్టు చైనాను 1-0 తేడాతో ఓడించి 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా పురుషుల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో, ఒకే ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు గెలవడం ఇదే తొలిసారి.ఈ టోర్నీ ఆద్యంతం భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆఖరి నిమిషంలో గోల్ చేసి 4-3 తేడాతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అంతకుముందు లీగ్ దశలో ఇండోనేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి జట్లపై భారీ గోల్స్ తేడాతో విజయాలు నమోదు చేసి తన సత్తా చాటింది. ఈ అద్భుత విజయంతో భారత హాకీ జట్టు ఆత్మవిశ్వాసంతో ఒలింపిక్స్‌కు సిద్ధమవుతోంది.ం

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు



**మొదటిపేజీ తరువాయి -** లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు.ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# స్విస్ అందాలలో ప్రమాద ఘంటికలు

**మొదటిపేజీ తరువాయి -** మంచు దుప్పటి కప్పుకున్న సుందరమైన ఆల్ప్స్ పర్వత శ్రేణులు. తెలుగు సినిమాల్లో హీరోహీరోయిన్లు డ్యూయెట్లు పాడుకునే ఆ అద్భుతమైన లొకేషన్లు మనసును ఆహ్లాదపరుస్తాయి. కానీ, ఇప్పుడు ఆ అందాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. కళ్లెదుటే ఆ మంచుకొండలు కరిగిపోతున్నాయి. భూతాపం, వాతావరణ మార్పుల కారణంగా స్విట్జర్లాండ్‌లోని హిమనీనదాలు (గ్లేసియర్లు) చరిత్రలో మునుపెన్నడూ లేనంత వేగంతో కరిగిపోతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.స్విస్ శాస్త్రవేత్తలు విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, గత ఐదేళ్ల కాలంలో స్విట్జర్లాండ్‌లోని హిమనీనదాలు ఏకంగా 20 శాతం మంచును కోల్పోయాయి. ఇందులో 5 శాతానికి పైగా నష్టం కేవలం ఈ ఒక్క ఏడాదిలోనే జరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా ఈ ఏడాది జులై నుంచి సెప్టెంబర్ మధ్య కరిగిన మంచుతో దాదాపు 2.2 లక్షల కోట్ల లీటర్ల నీరు నదుల్లోకి చేరింది. ఇది ఆ దేశ ప్రజల వార్షిక తాగునీటి అవసరాలకు నాలుగు రెట్లు అధికం. యూరప్‌లో రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలే ఈ విపత్కర పరిస్థితికి కారణమని 'స్విస్ గ్లేసియర్ మానిటరింగ్ నెట్‌వర్క్ (గ్లామోస్)', 'స్విస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' పరిశోధకులు తేల్చిచెప్పారు.పరిశోధనలో భాగంగా దేశంలోని 23 హిమనీనదాలను అధ్యయనం చేయగా దిగ్భ్రాంతికర వాస్తవాలు వెలుగుచూశాయి. ఉదాహరణకు, పశ్చిమ ఆల్ప్స్‌లోని ఒక హిమనీనదంలో జులైలో 13 అడుగుల పొడవైన కొలత స్తంభాన్ని పాతగా, సెప్టెంబర్ నాటికి అది 10 అడుగుల మేర బయటకు కనిపించింది. అంటే, కేవలం రెండు నెలల్లోనే 10 అడుగుల మందం మంచు కరిగిపోయిందన్నమాట. సగటున స్విస్ గ్లేసియర్ల మందం 8 నుంచి 13 అడుగుల వరకు తగ్గిపోయిందని నివేదిక పేర్కొంది. చిన్న గ్లేసియర్లు ఇప్పటికే పూర్తిగా కనుమరుగవగా, పెద్దవి కూడా వేగంగా కుంచించుకుపోతున్నాయి.ఈ పరిణామం కేవలం పర్యావరణానికే కాదు, స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవస్థకు కూడా పెను సవాలుగా మారింది. స్కీయింగ్ వంటి శీతాకాల క్రీడలకు, పర్యాటకానికి స్విస్ గ్లేసియర్లు ప్రాణాధారం. దేశ జనాభాలో 4 శాతానికి పైగా ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మంచు కరిగిపోతే వారి జీవనోపాధి ప్రశ్నార్థకమవుతుంది. అంతేకాకుండా, దేశ విద్యుదుత్పత్తిలో కీలకమైన జల విద్యుత్ కేంద్రాలు కూడా ఈ హిమనీనదాల నుంచే నీటిని పొందుతాయి. మంచు కరిగిపోతే భవిష్యత్తులో తీవ్ర ఇంధన సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది.పరిస్థితులు ఇలాగే కొనసాగితే, 2100 నాటికి స్విస్ హిమనీనదాలు 90 శాతం వరకు కనుమరుగవుతాయని గ్లేషియాలజిస్ట్ హ్యారీ జెకొల్లారి హెచ్చరించారు. కర్బన ఉద్గారాలను తగ్గించి, భూతాపాన్ని నియంత్రించగలిగితే ఈ నష్టాన్ని కొంతమేరకైనా తగ్గించవచ్చని ఆయన సూచించారు. ఇకపై పెరిగే ప్రతి 0.1 డిగ్రీల ఉష్ణోగ్రత కూడా మానవాళి మనుగడకు పెను ముప్పేనని, ఈ హెచ్చరిక ఒక్క స్విట్జర్లాండ్‌కు మాత్రమే కాదని, యావత్ ప్రపంచానికి వర్తిస్తుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు



**మొదటిపేజీ తరువాయి -** పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు.అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

## మీరు చెప్పేది మేం వింటాం..
## ఇదిగో సత్యాగ్రహ వెబ్ సైట్




**మొదటిపేజీ తరువాయి -** ప్రజలు తమ గళం విప్పుతున్నారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. భూమి, మహిళల హక్కులు, దళిత, ఓబీసీల హక్కులు, విద్య, పరీక్షల్లో అక్రమాలు వంటి అనేక అంశాలపై ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని తెలిపింది. ఇలా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉద్యమాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకువచ్చి, వాటిని సమన్వయం చేసేందుకు 'సత్యాగ్రహ' కార్యక్రమాన్ని రూపొందించినట్లు రాహుల్ గాంధీ తెలిపారు.ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. తమ సమస్యలు, పోరాటాలకు సంబంధించిన వివరాలను ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, నిర్దేశిత ఫారం నింపడం ద్వారా ఉద్యమకారులు తమ గళాన్ని జాతీయ స్థాయిలో వినిపించేందుకు అవకాశం కల్పించారు.ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళుతూ సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "మీ గళాన్ని మేం వింటాం, మీతో కనెక్ట్ అవుతాం. సత్యం, న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటానికి మా పూర్తి మద్దతు ఉంటుంది. 'సత్యాగ్రహ' వెబ్‌సైట్‌ను సందర్శించి మీ ఉద్యమ వివరాలను నమోదు చేయండి" అని ఆయన పిలుపునిచ్చారు. వివిధ ప్రాంతాల్లో విడివిడిగా జరుగుతున్న స్థానిక ఉద్యమాలకు జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టి, వాటిని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ఆదివారం 04 - 10 - 2026

## ఘనంగా బట్టా విజయ్ గాంధీ జన్మదిన వేడుకలు పాల్గొన్న

## అభిమానుల, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 03 ( తొలివార్త ):** కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ జన్మదిన వేడుకలు బూర్గంపాడు మండలం పోలవరంలో ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో వేడుకగా నిర్వహించబడ్డాయి. పినపాక పట్టినగర్ గ్రామ సర్పంచ్ బానోతు పద్మ పాల్గొని శాలువ తో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీల వద్ద అభిమానులు, కాంగ్రెస్ నాయకులు ఆయన సమక్షంలో కేక్ కట్ చేయించారు. ఈ క్రమంలో విజయ్ గాంధీకి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు మాట్లాడుతూ.. బట్టా విజయ్ గాంధీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం శ్రమిస్తున్నారని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. అభిమానుల కోలాహలం, నాయకుల నినాదాలతో జన్మదిన ప్రాంగణం సంతోషకరమైన వాతావరణంతో కోలాహలంగా మారింది.

## తుమ్మల చెరువు సర్పంచ్ ఎట్టి నరేష్ అధ్యక్షతన గ్రామసభ

**గ్రామంలో ప్రజా సమస్యలపై అభివృద్ధిపై అధికారులతో సమావేశం**




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 03 ( తొలివార్త ):** అశ్వాపురం మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలో గల కార్యాలయం నందు స్థానిక సర్పంచ్ ఎట్టి నరేష్ అధ్యక్షతన ప్రజా సమస్యలపై గ్రామలలో అభివృద్ధి పై గ్రామ సభ,ను,శుక్రవారం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి ప్రజా సంక్షేమం తదితర అంశాలపై, గ్రామాల లో పొలాలకు వెళ్లే అంతర్గత రహదారులపై, మరియు ఇండ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు కొరకు చర్చించడం జరిగింది. గ్రామాలలో నీటి సంరక్షణ మరియు నీటి వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో వి బి జి రాంజీ పథకం ద్వారా గ్రామాలకు అవసరమైన పనులను గుర్తించడం పట్ల, అలాగే గుర్తించిన పనులను తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఏపీఓ, సీతారామయ్య టి ఏ, ఏ ఈ ఓ ఎఫ్ఏ, పంచాయతీ సెక్రెటరీ, దినేష్ కుమార్ మరియు, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ సిబ్బంది వారి టీచర్స్ ఏఎన్ఎం ఆశా వర్కర్స్ గ్రామ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీలో

**రోస్టర్ సవరణ మాలల సమర శంఖారావం భారీ సభను విజయవంతం చేయండి**

**మాల జేఏసీ సంఘాల నాయకులు పిలుపు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 03 ( తొలివార్త ):** చలో...హైదరాబాద్ మాల సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా రోస్టర్ విధానంలో అవసరమైన సవరణలు సాధించేందుకు ఈనెల అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మాల విద్యార్థులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగుల భారీ సభను విజయవంతం చేయాలని మాల సంఘాల జేఏసీ పినపాక నియోజకవర్గం అధ్యక్షుడు చెట్టి సురేష్ విజ్ఞప్తి చేశారు.రోస్టర్ విధానంలో మాల సామాజిక వర్గానికి ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులను సభలో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రోస్టర్ విధానంలో మాలలకు న్యాయం జరిగేలా అవసరమైన సవరణలు సాధించేందుకు భవిష్యత్ కార్యాచరణను ఈ సభలో రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.మాల విద్యార్థులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులు ఐక్యంగా ముందుకు వచ్చి తమ హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెట్టి సురేష్ అన్నారు. ఈ సందర్భంగా, మాల జేఏసీ సంఘాల నాయకులు చెట్టి సురేష్ ధ్రువ కుమార్ కుమార్ వారు ఇరువురు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల,అక్టోబర్ 4న,ఉస్మానియా,యూనివర్సిటీలో విద్యార్థులు విద్యార్థి సంఘాలు మరియు ప్రజా సంక్షేమ మాల సంఘాల జేఏసీ నాయకులు,నిర్వహించే ఈ భారీ సభకు మాల విద్యార్థులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులు, మాల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని, వారు కోరారు.రోస్టర్ సవరణ సాధన కోసం మాలల సమర శంఖం పూరిస్తున్న ఈ సభను విజయవంతం చేయాలని వారు, సురేష్ ధ్రువ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల జేఏసీ నాయకులు మేకల భాస్కర్ మల్లేష్ అజయ్, కరకపల్లి డేవిడ్ రాజ్, మాల జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే డాక్టర్

## బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహలకు శంకుస్థాపన.

**రామ్ నరసయ్య నగర్ లో విగ్రహాల శంకుస్థాపన కార్యక్రమం.**




**కొనిజర్ల అక్టోబర్ 03 ( తొలివార్త ):** మహాత్మ జ్యోతిరావు పూలే భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థానిక రామ్ నరసయ్య నగర్ గ్రామం కొణిజర్ల మండలం ఖమ్మం జిల్లా నందు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ అంగోత్ కిరణ్ ఉపసర్పంచ్ జడ పిట రవి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని నిర్మాణం చేసిన భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని, ఈ దేశంలో రాజ్యాంగం అమలవుతుంది అంటే ఆ రోజుల్లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసినటువంటి రాజ్యాంగ మూలాన్ని భారతదేశంలో రాజ్యాంగం అమలు అవుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు గ్రామ పెద్దలు యువకులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొని మహాత్మ జ్యోతిరావు పూలే మరియు భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని ఈ విగ్రహాల ఏర్పాటు చేస్తున్న గ్రామ యువతకు అభినందనలు తెలియజేశారు. యొక్క మహత్తర కార్యక్రమాన్ని ముందుకు నడిపించడానికి గ్రామంలో ఉన్న అన్ని సామాజిక వర్గాల యువతి యువకులు ముందుకు వచ్చి కమిటీలో భాగస్వామ్యం పొంది నడిపించాలని మహనీయుల విగ్రహాల ఏర్పాటు కమిటీ కోరింది.



## అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్టగా ట్రెంచ్‌లు.. మళ్లీ యధావిధిగా



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 03 ( తొలివార్త ):** భద్రాచలం కూనవరం ప్రధాన రహదారి పరిధిలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు అధికారులు ట్రెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం అక్కడ ట్రెంచ్‌లు తొలగించబడిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. దీంతో అధికారులు ఏర్పాటు చేసిన అడ్డంకులు ఎలా తొలగించబడ్డాయి? వాటిని తొలగించేందుకు అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మళ్లీ యధావిధిగా అక్రమంగా ఇసుకతోలకాలు, పట్టించుకోని అధికారులు, అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లయితే దానిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ట్రెంచ్‌ల తొలగింపుపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఉపసర్పంచుల చెక్ పవర్‌పై ఆంక్షలు ఎత్తివేయాలి

**జాయింట్ చెక్ పవర్‌ను యథాతథంగా కొనసాగించాలి**

**ఉపసర్పంచులకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలి**

**జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు సుర్కంటి శ్రీధర్ రెడ్డి**



**చౌటుప్పల్, అక్టోబర్ 03 ( తొలివార్త ):** గ్రామ పంచాయతీల అభివృద్ధి,ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత కోసం ఉపసర్పంచులకు కల్పించిన జాయింట్ చెక్ పవర్‌పై ప్రభుత్వం విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు,మందోళ్ల గూడెం గ్రామ ఉపసర్పంచ్ సుర్కంటి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు.గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని సర్పంచులు, ఉపసర్పంచులు ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తారనే కారణంతో వారి మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం ఉపసర్పంచుల జాయింట్ చెక్ పవర్‌ను తొలగించాలనే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు.ఉపసర్పంచులు చెక్కులపై నిర్ణీత సమయంలో సంతకం చేయాలంటూ విధించిన ఆంక్షలు పంచాయతీల్లో పారదర్శకతకు విరుద్ధంగా మారే అవకాశం ఉందని శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.అవినీతిని అరికట్టేందుకు ఉద్దేశించిన జాయింట్ చెక్ పవర్‌ను బలహీనపరిచే చర్యలు కాకుండా,మరింత పారదర్శకంగా వ్యవహరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.2018లో అమల్లోకి వచ్చిన పంచాయతీరాజ్ చట్టం ద్వారా సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌కు జాయింట్ చెక్ పవర్ కల్పించారని ఆయన గుర్తుచేశారు.ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఉపసర్పంచులకు కల్పించిన ఈ అధికారాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఎవరైనా ఉపసర్పంచ్ సరైన కారణం లేకుండా చెక్కుపై సంతకం చేయకపోతే,ఆ అంశంపై సంబంధిత అధికారులు విచారణ నిర్వహించి తప్పు చేసిన వ్యక్తిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.కానీ ఒకరిద్దరి విషయంలో తలెత్తే సమస్యలను కారణంగా చూపుతూ రాష్ట్రంలోని ఉపసర్పంచులందరి పై ఆంక్షలు విధించడం సమంజసం కాదని అన్నారు.ఉపసర్పంచుల చెక్ పవర్‌పై విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేసేలా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పందించాలని శ్రీధర్ రెడ్డి కోరారు.అలాగే రాష్ట్రంలోని ఉపసర్పంచులకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం అందించాలని తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం తరపున డిమాండ్ చేశారు.ఉపసర్పంచుల హక్కులను పరిరక్షిస్తూ, గ్రామ పంచాయతీల్లో పారదర్శక పాలనకు అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమారుర్ ను వెంటనే తొలగించాలి సిపిఎం డిమాండ్.



**కొణిజర్ల అక్టోబర్ 03 ( తొలివార్త ):** ప్రజల ఓట్లను తొలగించే చర్యలకు పాల్పడుతున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమారును వెంటనే తొలగించాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ కొనిజర్ల మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు డిమాండ్ చేశారు. శనివారం చిన్నగోపతిలో నిర్వహించిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పారదర్శకంగా చేర్పులు మార్పులు చేయాల్సిన ఎన్నికల సంఘం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రతిపక్ష పార్టీలు ప్రజా సంఘాలు పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం కార్యదర్శిగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని అర్హులు అయిన ప్రతి పౌరుడికి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ప్రజల పేర్లు తొలగించకుండా సమగ్ర పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరుపై దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు విద్యార్థి యువజన సంఘాలు ఆందోళన నిర్వహిస్తున్నాయని వాటిపై కేంద్ర ప్రభుత్వ స్పందించాలని కోరారు. ఢిల్లీలో ఎన్నికల కమిషనర్ కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు యువకులు, సిపిఎం నాయకులు కార్యకర్తలు అరెస్టు చేసి నిర్బంధించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఓటు హక్కు రక్షణ కోసం గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని మరింత ఉద్దేశం చేస్తామని వారు హెచ్చరించారు. ఎన్నికల సంఘం స్వాతంత్రంగా నిష్పక్షపాతంగా వ్యవహరించేలా ప్రజలందరూ జరిగే పోరాటాలకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం డివిజన్ కమిటీ సభ్యులు బోయినపల్లి శ్రీనివాసరావు మండల కమిటీ సభ్యులు లింగాల చిన్నదానయ్య చిన్నగోపతి శాఖ కార్యదర్శి బుర్రి గోపయ్య బుర్రి కొండయ్య గోలమాల వ్యవహాలు గుడిమల్ల రు వేణు కొరెల్లి ఆనందరావు వలమాల సరోజిని కొచ్చర్ల కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

**తెలంగాణ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**





**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 03 ( తొలివార్త ):** అశ్వాపురం మండల పరిధిలోని తుర్రంవారిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నూతనంగా నిర్మించుకున్న ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే, తెలంగాణ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన లబ్ధిదారులు బానోతు అచ్చమ్మ, బానోతు శైలజ, నూతన గృహాళ్ళు నిర్మించిన,ఇందిరమ్మ ఇళ్ల ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవంచేసి,వారి కి అభినందనలు,శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన గృహాల్లోకి కుటుంబ సభ్యులతో కలిసి అడుగుపెట్టిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని.నూతన గృహాల్లో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. తెలంగాణ,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సారథ్యంలో రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ గృహ వసతి కల్పించే కార్యక్రమాలు,కొనసాగుతున్నాయని,ఎన్నో ఏళ్ల నుండి ఎదురుచూస్తున్న సొంతింటి కల ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులకు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని ఇల్లు లేని ప్రతి పేదవారికి ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే, ప్రధాన, లక్ష్యమని,తమ బాధ్యతని ఎమ్మెల్యే పాయం, వెంకటేశ్వర్లు, ఎర్కొన్నారు .ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా, ప్రజాప్రతినిధులు, అధికారులు, సమన్వయంతో, పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే,పాయం, స్పష్టం,చేశారు. తుర్రంవారిగూడెం గ్రామంలో బానోతు అచ్చమ్మ, బానోతు శైలజ కుటుంబాలు నూతన గృహాల్లోకి ప్రవేశించడం పట్ల గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కి మరియు ఇందిరమ్మ ఇండ్ల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో ,ముత్యాలరావు, సంబంధిత హౌసింగ్ శాఖ అధికారులు, మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి,రమేష్,బాబు,సీనియర్ నాయకులు,గాదె కేశవరెడ్డి మాజీ ఎంపీపీ ఊసా అనిల్ కుమార్ వరలక్ష్మి కన్స్ట్రక్షన్ అధినేత వేములపల్లి రమేష్, తూము వీర రాఘవులు ఆవుల రవి గొల్లపల్లి నరేష్ విజయ్, లంకమల్ల కొండలరావు, గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు,మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామంలోని ప్రజలు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తపాల శాఖ పోస్ట్ మాస్టర్ నిర్లక్ష్యంతో కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరు కాలేకపోయాం...

**గొందిగూడెం కొత్తూరు గ్రామం యడమ వెంకటేశ్వర్లు ఆవేదన**




NOTICE TO THE COMPLAINANT
IN THE COURT OF THE JUDICIAL FIRST CLASS MAGISTRATE
MANUGURU

**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 03 ( తొలివార్త ):** అశ్వాపురం మండలంలోని గొందిగూడెం కొత్తూరు, గ్రామ పంచాయతీ పరిధిలోని యడమ వారి గుంపు గ్రామానికి చెందిన మారుమూల ప్రాంతంలో,కూలి,పనులు,చేసుకుంటూ,నివాసముంటున్న యడమ వెంకటేశ్వర్లు,ఈ సందర్భంగా ఆయన,వారి నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ...నా... పేరు... యడమ వెంకటేశ్వర్లు.. నా.. కూతురు..యడమ నవ్య, ఒక అబ్బాయి తో వివాహ విషయంలో గొడవలు,కారణంగా, పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. కానీ నా కూతురికి న్యాయం జరగక పోవడంతో మేము కేసు పెట్టి ఉన్నాము,అట్టి కేసు కోర్టు ద్వారా విచారణ జరుగుతుండగా కోర్టు వాయిదాకి వెళ్లే విషయంలో మణుగూరు కోర్టు మెజిస్ట్రేట్ వారు 7/9/2026 న కోర్టు నోటీస్,జారీ,చేయడమైనది. మణుగూరు మేజిస్ట్రేట్ వారి నుండి 22/9/2026,న, తప్పక హాజరు కాగలరని పోస్ట్ ద్వారా, నోటీస్,లెటర్,పంపించినారు. మా కుటుంబానికి మా కూతురి కి జరిగిన అన్యాయం గురించి వివరించాలని తెలియజేస్తు, (పోస్ట్)లో తపాలా శాఖ, ద్వారా నోటీసులు పంపినారు. కానీ గొందిగూడెం పోస్ట్ మాస్టర్ సధరు ఉత్తర్వులు (నోటీసు) లెటర్ అనగా 30/9/2026న మాకు అందజేశారు. దీని కారణంగా మాకు జరిగిన అన్యాయం గూర్చి కోర్టు వారికి మా వాదనలు,వినపించలేకపోయినాము, మరియు మణుగూరు కోర్టు,మెజిస్ట్రేట్ వారి దృష్టిలో మేము గైరుహాజరు అయినాము. పోస్టుమాస్టర్,నిర్లక్ష్యం కారణంగా మేము మణుగూరు కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరు కాలేకపోయామని యడమ వెంకటేశ్వర్లు ఆవేదన చెందారు. అదే విధంగా, మారుమూల గ్రామాలలోని, ప్రజలకు, సంబంధించినవి ఏమైనా లెటర్స్ పాన్ కార్డులు ఆధార్ కార్డులు అలాగే చదువుకున్న యువతీ యువకులు ఉద్యోగాల విషయంలో, ఏమైనా కాల్ లెటర్స్ లాంటివి, వచ్చినా కూడా అవి మాదాక... అందడం లేదని, తపాలా శాఖ ద్వారా,సరైన సమాచారం తెలియక తీవ్ర ఇబ్బందులు, పడుతున్నామని గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, వేములూరు, మనబోతులగూడెం, గ్రామపంచాయతీలలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సమాచారం తెలియాలన్నా పోస్ట్ తపాలా శాఖ పోస్ట్ మాస్టర్ ద్వారా, సరైన సమాచారం తెలియడం లేదని అంతేకాకుండా, ఏమైనా పోస్టులో వచ్చిన గాని,ఇవ్వడానికి అనేక,మార్లు, నిర్లక్ష్యం,గా, వ్యవహరిస్తున్నారని, చదువు పూర్తి చేసుకున్న యువతీ యువకులు ఏదైనా ఉద్యోగాలకు అప్లై చేసుకున్న గాని కాల్ లెటర్స్ లాంటివి సంబంధించిన ఏవైనా తపాలా శాఖ ద్వారా, వచ్చిన కూడా వాటిని, ఇవ్వకుండా... ఉంటారా... అని గ్రామాల్లోని ప్రజలు, గాని.. మరియు బాధిత యడమ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు? పోస్ట్ మాస్టారు, పై, సంబంధిత శాఖ అధికారులు విచారణ చేపట్టాలని, కోరుతూ గతంలో కూడా దూర ప్రాంతాలలో నివాసముంటున్న ఆదివాసి ప్రాంతాలలోని యువతీ యువకులకు,కానీ ఇతరులకు, ఉద్యోగాలకు సంబంధించిన కాల్ లెటర్స్,విషయంలో, పోస్ట్ ద్వారా, గ్రామాల ప్రజలకు సంబంధిత లెటర్స్ పాన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఏటీఎం కార్డులు, పోస్టు, తపాలా శాఖ ద్వారా వచ్చిన,కూడా,వాటిని ఇవ్వడానికి, పోస్టుమాస్టర్, కనీసం ఊర్లలో తిరిగి ఇవ్వడం లేదని గ్రామాలలోని ప్రజలు, మరియు యడమ వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ. తపాలా శాఖ పోస్ట్ మాస్టర్, పై తగు చర్యలు సంబంధిత శాఖ అధికారులు తీసుకొని మాకు న్యాయం చేయగలరని మీడియా, విలేకరుల ముఖంగా అధికారులను కోరి ప్రార్థిస్తున్నాను, అని యడమ వెంకటేశ్వర్లు తెలిపారు.

# జ్ఞానేష్ కుమార్ ని వెంటనే తొలగించాలి..

**సర్ ను నిలిపివేసి,తొలగించిన ఓటర్ల హక్కును పునరుద్ధించాలి...!**

**సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి పాషా**




**చౌటుప్పల్ అక్టోబర్ 03 ( తొలివార్త ):** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)వెంటనే పదవి నుండి తొలగించాలని,సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్ )ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఈ ప్రక్రియలో అన్యాయంగా ఓటర్ల జాబితా నుండి తొలగించిన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధించాలని కోరారు.ఓటు హక్కు ప్రతి పౌరుడు రాజ్యాంగా హక్కు అని,అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఎం పార్టీ చౌటుప్పల మున్సిపల్ కార్యదర్శి గోషిక కరుణాకర్,ఉష్కాగుల శ్రీనివాస్,బత్తుల దాసు,ఆకుల ధర్మయ్య,బొడ్డు అంజిరెడ్డి,సప్పిడి శ్రీనివాస్ రెడ్డి,తూర్పునూరి మల్లేష్,ఆర్టీవో పాషా,బొడ్డు రాజు,భావండ్లపల్లి స్వామి,ఎండి ఖయ్యూం,బొమ్మకంటి కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

తొలివార్త
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com
ఆదివారం 04 - 10 - 2026

# నకిలీ పెన్షన్లపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి చేయూత పెన్షన్ ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్ కు బీజేపీ పార్టీ నాయకులువినతి**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 03 ( తొలివార్త ):** పాల్వంచ పట్టణంలోని 27 డివిజన్లలో అర్హత లేని వ్యక్తులు దివ్యాంగుల పెన్షన్లు, వృద్ధాప్య చేయూత పెన్షన్లు పొందుతున్న విషయం పై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు పొనిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం నాడు జిల్లా కలెక్టర్ అంకిత్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పొనిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పాల్వంచ పట్టణంలో దివ్యాంగుల పెన్షన్లు, వృద్ధాప్య చేయూత పెన్షన్ల మంజూరు, పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయి అని తెలిపారు. శారీరక వైకల్యం లేని కొంతమంది వ్యక్తులు తప్పుడు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా దివ్యాంగుల పెన్షన్లు పొందుతున్నారని, సదరం క్యాంప్ లో వైద్య అధికారులు 25000 నుండి 30000 వేల రూపాయలు తీసుకొని ఏ లోపం లేని వారికీ వికలాంగుల ధ్రువీకరణ పత్రాల జారీ చేసినారు అని ఆలా చేసిన వైద్య అధికారుల పాత్రపైనా విచారణ జరపాలని అన్నారు అదేవిధంగా, వృద్ధాప్య చేయూత పెన్షన్ల విషయంలోనూ అర్హతలను సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కేటీపీఎస్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన కొంతమంది వ్యక్తులకు 50000 వేల నుండి లక్ష రూపాలు ప్రభుత్వ నుండి రిటైర్డ్ అయిన తరువాత ప్రభుత్వ పెన్షన్ వస్తున్న వృద్యాప్య పెన్షన్స్ తీసుకుంటున్నారని నిబంధనలకు అనుగుణంగా అర్హత ఉందో లేదో పరిశీలించకుండా పెన్షన్లు పొందుతున్నారని అలాంటి వారి ని తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం దివ్యాంగుల పెన్షన్ కింద నెలకు రూ.3,016, వృద్ధాప్య చేయూత పెన్షన్ కింద నెలకు రూ.2,016 చొప్పున అందుతున్న నేపథ్యంలో, అర్హత లేని వ్యక్తులను గుర్తించకపోతే ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగే అవకాశం ఉందని అన్నారు. పాల్వంచ పట్టణంలోని మొత్తం 27 డివిజన్లలో పెన్షన్ లబ్ధిదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, అనుమానాస్పద దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను ప్రత్యేక వైద్య బృందాల ద్వారా పునఃపరిశీలించాలని కోరారు. అర్హత లేని వ్యక్తులు పెన్షన్లు పొందుతున్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలతో తేలిన సంబంధిత అధికారులు, సిబ్బందిపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు చేపట్టాలని అన్నారు అలాగే, అనర్హులకు చెల్లించిన నిధుల విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, నిజమైన అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పారదర్శకమైన విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరినము అని అన్నారు ఈ కార్యక్రమం లో బిజెపి నాయకులు మాలోత్ ప్రశాంత్ నాయక్, కొత్తపల్లి విజయ, శాంపురి నాగేంద్ర బాబు, వాంకుడోత్ హాథిరామ్, సంకినేని రుద్ర, అజ్మీరా హాథిరామ్, కోరదల రమేష్, శాంపురి పవన్, పండు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం

**యాదగిరిగుట్ట నుంచి శ్రీశైలం, రాయచూర్‌కు ప్రత్యేక డీలక్స్ బస్సులు**



**యాదగిరిగుట్ట, అక్టోబర్ 03 ( తొలివార్త ):** యాదగిరిగుట్ట నుంచి దూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కే. సురేష్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో ఆర్టీసీ బస్సు సర్వీసులు, సమయాలు, ఆన్‌లైన్ రిజర్వేషన్ వివరాలను వెల్లడించారు. యాదగిరిగుట్ట నుంచి శ్రీశైలానికి ప్రతిరోజూ డీలక్స్ బస్సు సర్వీసును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు యాదగిరిగుట్ట డిపో నుంచి బయలుదేరి, ఉదయం 6.20 గంటలకు భువనగిరి, 6.45 గంటలకు ఘట్కేసర్, 7.15 గంటలకు ఉప్పల్-- నల్లచెరువు మీదుగా హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) చేరుకుని అక్కడి నుంచి శ్రీశైలానికి వెళ్తుందని పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి తిరుగు ప్రయాణంలో బస్సు ప్రతిరోజూ సాయంత్రం 3.45 గంటలకు బయలుదేరి యాదగిరిగుట్టకు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు ముందస్తుగా తమ టికెట్లను ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని, ఇందుకోసం ఆర్టీసీ రిజర్వేషన్ నంబర్ 1915 ద్వారా వివరాలు తెలుసుకుని టికెట్లు బుక్ చేసుకోవచ్చని సూచించారు. అదేవిధంగా యాదగిరిగుట్ట నుంచి రాయచూర్‌కు ప్రత్యేక డీలక్స్ బస్సు సర్వీసులను కూడా నడుపుతున్నట్లు కే. సురేష్ కుమార్ తెలిపారు. యాదగిరిగుట్ట నుంచి ఈ బస్సులు మధ్యాహ్నం 12.30, 3.00, 3.45, సాయంత్రం 4.30, 5.00 గంటలకు బయలుదేరుతాయని చెప్పారు. రాయచూర్‌కు వెళ్లే ఈ డీలక్స్ బస్సులు భువనగిరి, ఘట్కేసర్, ఉప్పల్, హైదరాబాద్ ఎంజీబీఎస్, మహబూబ్‌నగర్, మక్తల్ మీదుగా రాయచూర్ చేరుకుంటాయని తెలిపారు. అనంతరం ఈ బస్సులు మరుసటి రోజు తిరిగి యాదగిరిగుట్టకు చేరుకుంటాయని వివరించారు. రాయచూర్ వెళ్లే బస్సుల్లో ప్రయాణించాలనుకునే ప్రయాణికులు ఆన్‌లైన్ రిజర్వేషన్, బస్సు సమయాలు తదితర వివరాల కోసం 9063404773 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని డిపో మేనేజర్ కే. సురేష్ కుమార్ సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఈ ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకోవాలని ఆయన కోరారు.

**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ**
**యాదగిరిగుట్ట డిపో**

యాదగిరిగుట్ట, భువనగిరి, ఘట్కేసర్ పట్టణ మరియు పరిసర గ్రామ ప్రజలకు తెలియజేయునది

ప్రయాణికుల సౌకర్యార్థం యాదగిరిగుట్ట డిపో నుండి ప్రతిరోజు శ్రీశైలం, రాయచూర్ కు బస్సులు నడుపుచున్నాము. ఇట్టి సర్వీసులకు TGSRTCBUS.IN లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడినది మరియు యాదగిరిగుట్ట, రాయగిరి, భువనగిరి, ఘట్కేసర్, ఉప్పల్ నల్లచెరువు వద్ద ప్రయాణికులు బస్సు ఎక్కుటకు అవకాశం కల్పించబడినది.

**యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం**

| యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం | | | | | శ్రీశైలం నుండి యాదగిరిగుట్ట | |
|---|---|---|---|---|---|---|
| Reservation Service Number | యాదగిరిగుట్ట నుండి | భువనగిరి నుండి | ఘట్‌కేసర్ నుండి | ఉప్పల్ నల్లచెరువు నుండి | Reservation Service Number | శ్రీశైలం నుండి |
| 1914 | 6:00 | 6:20 | 6:45 | 7:15 | 1915 | 15:45 |

**యాదగిరిగుట్ట నుండి రాయచూర్**

| యాదగిరిగుట్ట నుండి రాయచూర్ | | | | | రాయచూర్ నుండి యాదగిరిగుట్ట | |
|---|---|---|---|---|---|---|
| Reservation Service Number | యాదగిరిగుట్ట నుండి | భువనగిరి నుండి | ఘట్‌కేసర్ నుండి | ఉప్పల్ నల్లచెరువు నుండి | Reservation Service Number | శ్రీశైలం నుండి |
| 1918 | 12:30 | 12:50 | 13:15 | 13:45 | 1919 | 21:30 |
| 1921 | 15:00 | 15:20 | 15:45 | 16:15 | 1922 | 04:00 |
| 1930 | 15:45 | 16:05 | 16:30 | 17:00 | 1931 | 04:40 |
| 1910 | 16:30 | 16:50 | 17:15 | 17:45 | 1911 | 05:20 |
| 1968 | 17:15 | 17:35 | 18:00 | 18:30 | 1969 | 06:00 |

పెళ్లిళ్లకు, శుభకార్యాలకు మరియు టూర్లకు అద్దెకు బస్సులు ఇవ్వబడును.
ఇట్టి అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోగలరు.
-డిపో మేనేజర్, యాదగిరిగుట్ట.

## ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో అర్ధరాత్రి వైద్యం అందించి తల్లి కవల శిశువుల ప్రాణాలు కాపాడిన వైద్య బృందాలకు

**అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 03 ( తొలివార్త ):** మణుగూరు, భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య బృందాలు అర్ధరాత్రి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసి తల్లి, కవల శిశువుల ప్రాణాలను కాపాడిన ఘటనపై, స్పందించిన ఎమ్మెల్యే పాయం, మణుగూరు పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్ మరియు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వైద్యులకు మరియు సిబ్బందికి 108 అంబులెన్స్ పైలట్ చొరవతో సమన్వయంతో, అంబులెన్స్ వాహనాన్ని నడపడం ఎలాంటి అవంతరాలు జరగకుండా నిండు గర్భిణీ స్త్రీ అయిన మహిళలకు ప్రాణాపాయ స్థితి నుంచి, ఆపరేషన్ చేసి విజయవంతమైన వైద్యం అందించి కాపాడినందుకు వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలియజేశారు. తీవ్రమైన రక్తహీనత, అధిక రక్తపోటు, కవలల గర్భధారణ, రెండో శిశువుకు అబ్స్ట్రక్టెడ్ లేబర్ వంటి అనేక ప్రమాదకర పరిస్థితులు ఉన్నప్పటికీ, వైద్యులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో నిర్ణయాలు తీసుకుని తల్లికి, ఇద్దరు శిశువులకు అత్యవసర వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో తొలి శిశువుకు సురక్షితంగా సాధారణ ప్రసవం నిర్వహించిన అనంతరం, రెండో శిశువుకు అత్యవసర సిజేరియన్ అవసరమని గుర్తించి వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేయడం, అక్కడ వైద్య బృందం సకాలంలో స్పందించి అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించడం వైద్యుల సమన్వయానికి నిదర్శనమని తెలిపారు. మారుమూల ప్రాంతాలకు చెందిన గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో ఉన్నతస్థాయి ఆసుపత్రులతో సమన్వయం చేసుకుని ప్రాణాలను కాపాడుతున్న ప్రభుత్వ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బందికి ప్రత్యేక అభినందనలు అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా మణుగూరు, భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మిడ్‌వైఫ్స్, ఓ టి, సిబ్బంది మరియు ఈ అత్యవసర వైద్య సేవల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హృదయపూర్వక, అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. తల్లి, ఇద్దరు కవల శిశువులు ప్రస్తుతం క్షేమంగా ఉండటం సంతోషకరమైన విషయమని, ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

# ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే కుంభం తక్షణ స్పందన

**అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారానికి ఆదేశాలు**



**వలిగొండ, అక్టోబర్ 03 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తక్షణమే స్పందించారు. శనివారం వలిగొండలోని ఎమ్మెల్యే నివాసంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల సమస్యలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై వినతులను సమర్పించారు. ప్రజలు వివరించిన సమస్యలను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సావధానంగా విని, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల తీవ్రతను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, గ్రామ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకిరాములు, ఉప సర్పంచ్ మల్ల మాధవి, వెంకటేశం, వార్డు సభ్యులు, శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్త కూర వెంకటేశం, శాఖా గ్రంథాలయ అధ్యక్షుడు ఆదిమూలం సోమేశ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు బత్తిని లింగయ్య, కాసుల వెంకన్న, కొండూరు భాస్కర్, ఐటిపాముల రవీంద్ర, మైసోళ్ళ యాదగిరి, మైసోళ్ళ లక్ష్మీనర్సు, మైసోళ్ళ రామనర్సు, మాజీ ఉప సర్పంచ్ మైసోళ్ళ మత్స్యగిరి, చిలుగూరి సత్తిరెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు.... అభివృద్ధికి మరింత తోడ్పాటు.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 03 ( తొలివార్త ): ప్రతి నిధి.** సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధి భౌరంపేట్ లక్ష్మీ నగర్ కాలనీలో విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా నాలుగు నాలుగు ట్రాన్ఫార్మర్లను ఏర్పాటు చేయగా, మాజీ కౌన్సిలర్ మురళీ యాదవ్ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన ట్రాన్ఫార్మర్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ విచ్చేసి ట్రాన్ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ద్వారా అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని, గత 12 ఏళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పాటు దుండిగల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ప్రసూన, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, ధర్మా రెడ్డి, కాలనీ వాసులు తిరుపతి రెడ్డి, దిలీప్, సూరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

# బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి



**జేరిపోతుల యాదగిరి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం**

**తుర్కపల్లి అక్టోబర్ 03 ( తొలివార్త ):** అక్టోబర్ 5వ తేదీన అడ్డగూడూరు నుండి భువనగిరి వరకు నిర్వహిస్తున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల యాదగిరి అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు చిన్నూరి మహేష్, ఆధ్వర్యంలో ఆవిష్కరించారు .ఈ సందర్భంగా జేరిపోతుల యాదగిరి మాట్లాడుతూ అంబేద్కర్ అభయాసం పథకాన్ని అమలుపరచడానికి, ఎస్సీల అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చాలని, అర్హులైన మాదిగలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, పాలక ప్రభుత్వంపై ఒత్తిడికై అక్టోబర్ 5న అడ్డగూడూరు మండలం నుండి భువనగిరి వరకు జరుగు బైక్ ర్యాలీని మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో చిన్నూరి కైలాస్, చిన్నూరి స్వామి, బూసి మహేష్ ,బొల్లారం హరిబాబు, జేరిపోతుల మధు, చిన్నూరి సంతోష్, బొల్లారం హరిబాబు, పాల్గొన్నారుద

## ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులుగా నాగం సరిత సుధీర్ రెడ్డి ఎన్నిక..





**నూతనకల్, అక్టోబర్ 03 ( తొలివార్త ):** ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులుగా నాగం సరిత సుధీర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ బందు యాకయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయా గ్రామాల ఉపసర్పంచులు ఉమాదేవి ఫంక్షన్ హాల్ లో సమావేశమై ఉప సర్పంచ్ ల ఫోరం మండల కమిటీని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం ఆ సంఘం కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన నాగం సరిత సుధీర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాల అభివృద్ధికి, ఉప సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి, స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రధాన కార్యదర్శి గా నేనావత్ సురేంద్రనాయక్, కార్యదర్శిగా సామ సురేందర్ రెడ్డి, కోశాధికారిగా గంట నాగమణి రవిశంకర్, ఉపాధ్యక్షులుగా గోరంట్ల వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ గా వల్లమల్ల నరేష్, మంగళపల్లి నారాయణ, మరికంటి అనసూయ, జ్యోతి, స్వరూప, నాగరాజు, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ వర్కర్ లతీఫ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్.



**వైరా అక్టోబర్ 03 ( తొలివార్త ):** సిరిపురం కేజీ గ్రామంలో సోషల్ వర్కర్ లతీఫ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ నిర్వహిస్తున్నారు. సిరిపురం కేజీ గ్రామానికి చెందిన తడికమల్ల శిరీష అనే గర్భిణీ స్త్రీని టెస్టుల నిమిత్తం వైరా ప్రవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి మరల టెస్టుల తర్వాత వారి ఇంటి వద్ద దింపటం పట్టడం జరిగింది. ఏ సందర్భంగా సోషల్ వర్కర్ల లతీఫ్ మాట్లాడుతూ సమాజానికి సమాజంలో ఎంతో కొంత సేవ చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, పేద బడుగు బలహీన వర్గాల వారి కోసం ఎంతో కొంత సాయం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని, కేజీ సిరిపురం చుట్టుపక్కల గ్రామాల వారు గర్భిణీ స్త్రీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సోషల్ వర్కర్ల లతీఫ్ ఫోన్ నెంబర్9603747878 కి ఫోన్ చేసి తెలపగలరని తెలియజేశారు.

## ఆపదలో ఉన్నకుటుంబాలకు అండగాసీఎంఆర్ ఎఫ్

**మండల పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి**



**నూతనకల్.. అక్టోబర్ 03 ( తొలివార్త ):** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా పీఎంఆర్ఎఫ్ చెక్కులు ఉపయోగపడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి అన్నారు శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ సహకారంతో వారి ఆదేశాల మేరకు నాలుగు లక్షల ఇరవై ఒక్క వేల రూపాయల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో గుగులోత్ కృష్ణ నాయక్ పాండవుల లింగన్న బోల్కా సైదులు యాదవ్ నేనావాత్ సురేందర్ నాయ క్ రవిశంకర్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేట్ ఉపాధ్యాయుల ఘన సన్మానం

**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరు**







**భువనగిరి, అక్టోబర్ 03 ( తొలివార్త ):** ప్రైవేట్ విద్యా రంగంలో విద్యార్థులకు విద్యాబోధన అందిస్తూ సమాజ అభివృద్ధికి తమవంతు సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై ప్రైవేట్ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి అంశాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు చేస్తున్న కృషిని వారు అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రైవేట్ ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యా రంగానికి చెందిన పలువురు ప్రతినిధులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మైనారిటీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ గా మహమ్మద్ ఉస్మాన్ నియమకం



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 03 ( తొలివార్త ): ప్రతి నిధి.** బాచుపల్లి: మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మైనారిటీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ గా మహమ్మద్ ఉస్మాన్ గారు నియమితులయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మహమ్మద్ ఉస్మాన్ మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం హన్మంతన్న మహమ్మద్ ఉస్మాన్ గారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ మైనారిటీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీ సయ్యద్ షఫీ, సీనియర్ నాయకులు సంపంగి వెంకటేష్ , పాషా భాయ్, సయ్యద్ ఆరిఫ్, ఎండీ నసీర్, ఎండీ అజీమ్, ఎండీ సల్మాన్, తదితర మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కి వృద్ధులకి చేస్తున్న సేవలకు గుర్తింపు

**అంతర్జాతీయ శాంతి, ప్రతిభ పురస్కారం**




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 03 ( తొలివార్త ):** అశ్వాపురం మండలం లో వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న ఆరిఫా అండ్ రోషిని రీమా వృద్ధాశ్రమ నిర్వాహకురాలు షహనాజ్ బేగంకు అంతర్జాతీయ శాంతి మరియు ప్రతిభ పురస్కారం 2026 లభించింది. వంశీ ఈవెంట్స్ అండ్ మోర్ధ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి హైదరాబాద్ కింగ్‌కోటి తిలక్ రోడ్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ జాటో రామచంద్రం నాయక్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు.గత 15 సంవత్సరాలుగా ఆరిఫా అండ్ రోషిని రీమా వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న షహనాజ్ బేగం, ఆదరణకు నోచుకోని ఎంతోమంది వృద్ధులను చేరదీసి మానవతా దృక్పథంతో సేవలందిస్తున్నారు.కులమతాలకు అతీతంగా వృద్ధులకు ప్రేమానురాగాలు పంచుతూ, వారికి ఆహారం, వసతి, వైద్య సహాయం తదితర సౌకర్యాలను కల్పిస్తూ వారికి అండగా,నిలుస్తున్నారు.కన్నబిడ్డల ఆదరణకు దూరమై, జీవితంపై విరక్తి చెంది, తమను తాము భారంగా భావించే పరిస్థితుల్లో ఉన్న వృద్ధులకు 'నేనున్నాను' అంటూ షహనాజ్ బేగం భరోసా కల్పిస్తున్నారని నిర్వాహకులు కొనియాడారు. వృద్ధుల పట్ల ఆమె చూపుతున్న ఓర్పు, ప్రేమ, మానవతా సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీ, డాక్టర్ శ్రీనివాస్, జర్మన్‌టన్ హాస్పిటల్, అత్తాపూర్ నిర్వాహకులు డాక్టర్ ఇష్తికార్, నగర ప్రముఖులు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతతోనే ఒత్తిడిని అధిగమించగలంలి

**'ది అన్‌చార్టెడ్ ఆర్టరీ' పుస్తకావిష్కరణలో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి.**

**రచయిత డాక్టర్ శరత్ రెడ్డికి అభినందనలు తెలిపిన కీర్తిరెడ్డి.**



**హైదరాబాద్: అక్టోబర్ 03 ( తొలివార్త ):** ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలను అధిగమించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మెడికవర్ ఆస్పత్రిలోని బ్లూ ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శరత్ రెడ్డి రచించిన 'ది అన్‌చార్టెడ్ ఆర్టరీ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీ రమేష్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, బీజేపీ సీనియర్ నాయకులు డోకూరి పవన్ కుమార్ రెడ్డి, ప్రముఖ సినీనటుడు రాజా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. 'ది అన్‌చార్టెడ్ ఆర్టరీ' పుస్తకం డాక్టర్ శరత్ రెడ్డి ఆలోచనా విధానానికి నిదర్శనం అన్నారు. శారీరక ఆరోగ్యంపై అవగాహనతో అంతర్గత ప్రశాంతత, మానసిక సమతుల్యత వైపు ప్రజలను నడిపించే ప్రయత్నం ఈ పుస్తకంలో కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో వేగవంతమైన జీవనశైలి కారణంగా ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతున్నాయన్నారు.

## అంగన్ వాడీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**నందికొట్కూరు , అక్టోబర్ 03 ( తొలివార్త ):** :రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీలకు అందిస్తున్న సేవలు ప్రజలకు అందేలా చూడాలని నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య సూచించారు. మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం 3వ సెంటర్‌లో నిర్వహించిన అంగన్వాడీ ఉత్సవం – సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్యా బోధన, ఆరోగ్య సేవలు తదితర అంశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అంగన్వాడీ సిబ్బంది సేవలను అభినందిస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల దగ్గరికి తీసుకెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం అంగన్ వాడి కార్యకర్తలను ఎమ్మెల్యే జయసూర్య, సీడీపీఓ మంగవళి సన్మానించారు.. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, నందికొట్కూరు టిడిపి అబ్జర్వర్ ,వెంకట శివుడు, పలుచాని మహేశ్వర్ రెడ్డి, లింగ స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్చరిక బోర్డుల్లేవు.. వాహనదారులకు తిప్పలే

**కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రెండు కిలోమీటర్లు వెళ్లి తిరిగి వస్తున్న వాహనదారులు.**

**సొంత ఖర్చుతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన సామాజిక కార్యకర్త**




**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 03 ( తొలివార్త ):ప్రతి నిధి.** రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నా.. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూరారం ఎక్స్‌రోడ్ నుంచి బౌరంపేట్, శంబిపూర్ , ఐడీఏ బొల్లారం, మియాపూర్ వైపు వెళ్లే మార్గంలో సూరారం గ్రామం విశ్వకర్మ కాలనీ ప్రాంతం దాటిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. కాగా పనులు జరుగుతున్న విషయాన్ని ముందుగానే తెలియజేసే సూచికలు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో భారీ వాహనాలతో పాటు చిన్న వాహనాలు సైతం సుమారు రెండు కిలోమీటర్లు వెళ్లి తిరిగి వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. వాహనదారుల ఇబ్బందులను గమనించిన మాజీ లారీ యజమాని, నార్త్ రన్ సిటీ ఇసుక లారీల సంఘం మాజీ కార్యదర్శి, సామాజిక--పర్యావరణ కార్యకర్త రవీందర్ ముదిరాజ్ స్పందించారు. అధికారుల కోసం ఎదురుచూడకుండా తన సొంత ఖర్చుతో మూడు సూచిక బ్యానర్లు ఏర్పాటు చేసి వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించారు. సూరారం చౌరస్తా నుంచి కట్టమైసమ్మ ఆలయం--బహదూర్పల్లి ఎక్స్‌రోడ్ చౌరస్తా వరకు వెళ్లి ఎడమవైపు తిరిగి బౌరంపేట్, ఐడీఏ బొల్లారం, బాచుపల్లి వైపు వెళ్లాలని వాహనదారులకు సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, బాబు, నవీన్‌కుమార్,కార్తీక్, రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి తాము ఇబ్బంది పడుతున్నా ప్రజల భద్రత కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంపై స్థానికులు, వాహనదారులు రవీందర్ ముదిరాజ్‌ను అభినందించారు. ఇలాంటి బాధ్యతాయుతమైన వ్యక్తులు ఉన్నంతకాలం ప్రజా ప్రయోజనం, న్యాయం బతికే ఉంటాయి అంటూ ఆయన సేవలను కొనియాడారు.

# వైకాపా నేత డాక్టర్ ధారా సుధీర్ పై ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఫైర్




**నందికొట్కూరు , అక్టోబర్ 03 ( తొలివార్త ):** వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధారా సుధీర్ కు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి వార్నింగ్ ఇచ్చారు. శనివారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం, పగిద్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామ బస్టాండ్ సెంటర్ లో నంద్యాల ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ఫ్లాంట్ ను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. అనంతరం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఎంపీ నిధులతో గ్రామాల్లో, ముఖ్యంగా దళిత, బడుగు బలహీన వర్గాల కాలనీలలో మినరల్ వాటర్ ఫ్లాంట్లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. అనంతరం గత రెండు రోజుల క్రితం వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధారా సుధీర్ కూటమి నేతలపై , ప్రభుత్వం పై ఆరోపణలు చేస్తూ విమర్శలు చేస్తున్నారని పాత్రికేయులు ఎంపీని అడిగారు. అయితే






ఆమె ధారా సుధీర్ పై తీవ్ర స్థాయిలో ఆగ్రహించారు. తాను ఎక్కడి నుండో వచ్చి నందికొట్కూరు ఫ్యాక్షన్ గురించి మాట్లాడుతున్నారని ఆయానాకేం తీసుసన్నారు. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగి ఫ్యాక్షన్ కళ్ళారా చాసిన వాళ్ళం మేమన్నారు. నందికొట్కూరు ప్రశాంతంగా ఉందని ఇక్కడ ఫ్యాక్షన్ కు తెరలేపాలని, ఫ్యాక్షన్ నేర్పిస్తామని చూస్తే చూస్తూ ఊరుకోమని తోకలు కట్ చేస్తామన్నారు. అతను మళ్ళీ వెనక్కి వెళ్లి ప్రాక్టీస్ కూడా చూసుకోవడానికి ఉండదన్నారు. ఊరికే మా ఎమ్మెల్యే గిత్త జయసూర్య పైన, కూటమి ప్రభుత్వం పైన మాట్లాడటం కాదు. మొదట మీరు ఎవరు, ఏంటి అనేది అర్థం చేసుకుని మాట్లాడితే మంచిది. నియోజకవర్గ ప్రజలు చాలా తెలివైన వారని, అతను ఎక్కడి నుండో వచ్చి పెత్తనం చేలాయించడానికి వస్తే ఈ ప్రజలు ఎవ్వరు ఓట్లు వేయారన్నారు. ఇప్పుడు నందికొట్కూరు ప్రశాంతంగా ఉంది. ప్రశాంతతను పోగొట్టాడానికి చూస్తే మాత్రం నందికొట్కూరు లో అడుగు కూడా పెట్టనివ్వనని ఎంపీ అన్నారు. కార్యక్రమంలో ముచ్చుమర్రి టీడీపీ సీనియర్ నాయకులు కాటం. వెంకటరామిరెడ్డి, రాఘవరెడ్డి, విద్యార్థి సంఘం నాయకులు కుమ్మరి. నాగరాజు, సుబ్బారావు, బాలనారాయణ, నాగేశ్వరావు, చిన్న సుంకన్న, రాముడు, మాజీ మున్సిపల్ చైర్మన్ డి. సుధాకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్. కాకరవాడ. చిన్న వెంకటస్వామి, కట్టుబడి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండలో జేవీఆర్ ఈవీ మొబిలిటీ నూతన షోరూంను ప్రారంభించిన డిఎస్పి శివరాం



**నల్గొండ టౌన్, అక్టోబర్ 03 ( తొలివార్త ):** నల్గొండ పట్టణం దేవరకొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జేవీఆర్ ఈవీ మొబిలిటీ షోరూంను డీఎస్పీ శివరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – పెరుగుతున్న పెట్రోల్ ధరల దృష్ట్యా ఎలక్ట్రిక్ వాహనాలు ఎంతో ఉపయోగకరమని, పెట్రోల్ ఖర్చు ఆదా కావడంతో పాటు వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని అన్నారు. ఈవీ వాహనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం షోరూం యాజమాన్యం డీఎస్పీని శాలువాతో సన్మానించింది. ఈ కార్యక్రమంలో జేవీఆర్ చైర్మన్ జె. వెంకటేశ్వరరావు, ఎండీ ఎస్. నీరజ ప్రసాద్ నాయుడు, తెలంగాణ సేల్స్ హెడ్ కొల్లు నరేష్, ఇంచార్జ్ కంకణాల రమేష్ రెడ్డి, పంతులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తుడిమిడిలో చాటుకున్న గ్రామ ఐక్యత బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**తుంగతుర్తి నియోజకవర్గం / శాలిగౌరారం, అక్టోబర్ 03 ( తొలివార్త ):** శాలిగౌరారం మండలం తుడిమిడి గ్రామ పంచాయతీ పరిధికి చెందిన పెద్ది రామకృష్ణ గౌడ్ ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో నిరాశ్రయులైన వారి కుటుంబానికి తుడిమిడి గ్రామస్తులు అండగా నిలిచి తమ గ్రామ ఐక్యతను చాటుకున్నారు. ఒకరికి కష్టం వచ్చిందంటే అందరూ తోడుగా నిలవడం మన ఊరి గొప్పతనమని, మన ఊరిలో ఉన్న ఐకమత్యం ఇంకే ఊరిలో ఉండదని, ఇలా అందరూ ముందుకు రావడం చాలా గర్వంగా ఉందని గ్రామస్తులు అన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంభం రమేష్, చెవుగాని శంకర్ గౌడ్, కోడిమల శంకర్, బండారు చంద్రశేఖర్, బొమ్మగాని రమేష్, పెద్ది రమేష్, బిక్కి రాజశేఖర్, గడ్డగూటి జానయ్య, పెద్ది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జే వి ఆర్ ఇవి మొబిలిటీ షో రూమ్ ప్రారంభించిన డిఎస్పి శివరామిరెడ్డి



**అక్టోబర్ 03 ( తొలివార్త ):** నల్గొండ పట్టణంలోని దేవరకొండ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన జివిఆర్ ఇవి షోరూమ్ ను డిఎస్పి శివరామిరెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవి షోరూమ్ నల్గొండ లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం పెట్రోల్ రేట్లు కాబట్టి బ్యాటరీతో నడిచే వాహనాలు కొనడం వల్ల పెట్రోల్ డబ్బులు మిగులుతాయని అన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బ్యాటరీతో నడిచే వాహనాల వల్ల వాతావరణంలో కాలుష్యాన్ని కూడా అరికట్టవచ్చని అన్నారు. అనంతరం డిఎస్పిని షోరూం యజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో జేవిఆర్ ఇవి షోరూమ్ ల చైర్మన్ జె వెంకటేశ్వరరావు, ఎండి ఎస్ నీరజ ప్రసాద్ నాయుడు తెలంగాణ సేల్స్ హెడ్ కొల్లు నరేష్ షోరూం ఇంచార్జ్ కంకణాల రమేష్ రెడ్డి, పంతులు శ్రీనివాస్ పాల్గొన్నారు...

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు.. చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

**తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్**

**మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి**

**షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**నిరాశలో బీజేపీ శ్రేణులు**

**పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ**



కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## నా పోటీ హుజూర్‌నగర్ నుంచే.. వదంతులు నమ్మొద్దు: మంత్రి ఉత్తమ్

**వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్**

**తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి**

**కాళేశ్వరం డిజైన్ లో లోపాలు ఉంటే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని వెల్లడి**



తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
తెలుగు దిన పత్రిక
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com



# హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ఐదుగురు నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర

ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ఐదుగురి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేసింది. వీరితో సోమవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ ప్రమాణం చేయించనున్నారు. ఏపీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పని చేస్తున్న ఐదుగురికి శాశ్వత న్యాయమూర్తుల హోదా లభించింది. జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ (టీసీడీ శేఖర్), జస్టిస్ చల్లా గుణరంజన్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావులను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ వీరితో సోమవారం హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణం చేయించనున్నారు.అదనపు న్యాయమూర్తులుగా వీరి పదవీకాలం త్వరలో ముగియనుంది. ఈ నేపథ్యంలో శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం ఈ ఏడాది సెప్టెంబరు 23న కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఐదుగురినీ శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు.జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్, జస్టిస్ చల్లా గుణరంజన్?లు హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా 2024 అక్టోబర్ 28న ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, డాక్టర్ జస్టిస్ యాదవల్లి లక్ష్మణరావు 2025 జనవరి 24న అదనపు



న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్?లో హైకోర్టులో ప్రాక్టీస్ జస్టిస్ కుంచం మహేశ్వరరావు తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ అకడమిక్ లాస్, బ్యాచిలర్ ఆఫ్ లా పట్టాలను పొందారు. 1998 ఫిబ్రవరి 17న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత తొలుత అనంతపురంలోని ట్రయల్ కోర్టులలో తన ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. అనంతరం 2000వ సంవత్సరంలో ఆయన తన ప్రాక్టీస్‌ను హైదరాబాద్‌లోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మార్చారు. అదేవిధంగా కుంచం మహేశ్వరరావు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, హెచ్‌పీసీఎల్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ, ఇతర ప్రతిష్టాత్మక ఆర్థిక సంస్థలతో సహా అనేక ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పని చేశారు.వాణిజ్య పన్నుల ప్రభుత్వ ప్లీడర్‌గా: జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ నెల్లూరు వీఆర్ లా కాలేజీలో బ్యాచిలర్ ఆఫ్ లా పట్టా పొందారు. 1999 మార్చి 11న ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ జాబితాలో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. ఆయన సెప్టెంబర్ 2019 నుంచి బెంచ్‌కు పదోన్నతి పొందే వరకు హైకోర్టులో ఏపీ రాష్ట్రానికి వాణిజ్య పన్నుల ప్రభుత్వ ప్లీడర్‌గా పనిచేశారు.జస్టిస్ చల్లా గుణరంజన్ హైదరాబాద్‌లో డిగ్రీ, న్యాయశాస్త్ర విద్యను పూర్తి చేశారు. 2001లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. ఆయన 2011 నుంచి 2013 వరకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేశారు. అదేవిధంగా హైకోర్టులో వివిధ విద్యాసంస్థల తరఫున పలు కేసులు వాదించారు. ఆయన ట్రిబ్యునల్స్, హైకోర్టులో భారత ప్రభుత్వానికి చెందిన వివిధ ప్రభుత్వ రంగ సంస్థల తరఫున ప్రత్యేక న్యాయవాదిగా కూడా వాదించారు.2007లో ఉన్నత న్యాసేవలో: జస్టిస్ అవధానం హరి హరనాథ శర్మ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న నెల్లూరు వీఆర్ లా కాలేజీ నుంచి బీఎల్ డిగ్రీని పొందారు. ఆయన 1994 మార్చి 2న ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ రికార్డులలో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. ఆయన ప్రత్యక్ష నియామకం ద్వారా జిల్లా న్యాయమూర్తిగా ఎన్నికై, 2007లో ఉన్నత న్యాయసేవలో చేరారు.జస్టిస్ యాదవల్లి లక్ష్మణ రావు నెల్లూరు వీఆర్ లా కాలేజీ నుంచి బీఏఎల్, బీఎల్ డిగ్రీలను పూర్తి చేశారు. ఆ తర్వాత విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. ఆయన 2014 ఫిబ్రవరి 25 నుంచి పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా పనిచేశారు.

# అమరావతి ఓఆర్ఆర్‌కు టెండర్లు హ్యామ్ విధానంలో నిర్మాణం

రాజధాని అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాల చుట్టూ నిర్మిస్తున్న యాక్సెస్ కంట్రోల్డ్ అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణ ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది.రాజధాని అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాల చుట్టూ నిర్మిస్తున్న యాక్సెస్ కంట్రోల్డ్ అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణ ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. దీని నిర్మాణానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ టెండర్లు ఆహ్వానించింది. ఈ ప్రాజెక్ట్‌కు కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ) అనుమతి, ఆ తర్వాత కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ అనుమతి త్వరలో లభించనుండటంతో ఈ లోపు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. 189.93 కి.మీ. మేర 6 వరుసలతో కూడిన ఓఆర్ఆర్, నారాకోడూరు నుంచి గుంటూరు శివారు బుడంపాడు వరకు 4 వరుసలతో 5.2 కి.మీ. మేర నిర్మించే అనుసంధాన రహదారి (స్పర్ రోడ్) కలిపి మొత్తం 195.13 కి.మీ. నిర్మాణానికి శుక్రవారం టెండర్లు ఆహ్వానించారు. ఈ ప్రాజెక్టును నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. సివిల్ పనుల అంచనా వ్యయంగా నాలుగు ప్యాకేజీల్లో కలిపి రూ.11,537 కోట్లుగా పేర్కొన్నారు. శుక్రవారం నుంచే టెండర్ల డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. నవంబరు 18 ఉదయం 11 గంటల వరకు బిడ్లు దాఖలుకి అవకాశం కల్పించారు. నవంబరు 19న టెండర్లు తెరవనున్నారు.

### 4 ప్యాకేజీలు

ప్యాకేజీ-1: ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల సమీపంలోని ఓఆర్ఆర్‌లో 189వ కి.మీ. నుంచి 189.93 కి.మీ. వద్ద విజయవాడ-హైదరాబాద్ హైవే వరకు (930 మీటర్లు), అక్కడ మొదలయ్యే 0 కి.మీ. నుంచి మైలవరం సమీపంలో 27వ కి.మీ. వరకు కలిపి మొత్తం 27.93 కి.మీ. మొదటి ప్యాకేజీగా పేర్కొన్నారు. దీనికి అంచనా వ్యయం రూ.2,975.47 కోట్లుగా పేర్కొన్నారు.

ప్యాకేజీ-2: మైలవరం సమీపంలోని ఓఆర్ఆర్‌లో 27వ కి.మీ. నుంచి కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను, దావులూరు సమీపంలో 83వ కి.మీ. వరకు 56 కి.మీ. రెండో ప్యాకేజీగా టెండరు పిలిచారు. దీని అంచనా వ్యయం రూ.2,864.69 కోట్లుగా పేర్కొన్నారు.

ప్యాకేజీ-3: కోలవెన్ను, దావులూరు సమీపంలోని ఓఆర్ఆర్ 83వ కి.మీ. నుంచి గుంటూరు సమీపంలోని కొర్నెపాడు వద్ద 133.5 కి.మీ. వరకు 50.5 కి.మీ. మేర ఆరు వరుసల రహదారితో పాటు ఓఆర్ఆర్‌లో నారాకోడూరు నుంచి గుంటూరు శివారులో బుడంపాడు వద్ద చెన్నై-కోల్‌కతా హైవే వరకు 5.2 కి.మీ. నాలుగు వరుసల అనుసంధాన రహదారి కలిపి మూడో ప్యాకేజీలో ఉన్నాయి. వీటి మొత్తం అంచనా వ్యయం రూ.2,827.95 కోట్లుగా ఖరారు చేశారు.

ప్యాకేజీ-4: కొర్నెపాడు వద్ద ఓఆర్ఆర్ 133.5 కి.మీ. నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని కంచికచర్ల సమీపంలో 189 కి.మీ. వరకు 55.5 కి.మీ నాలుగో ప్యాకేజీగా టెండరు పిలిచారు. దీని అంచనా వ్యయం రూ.2,869.59 కోట్లుగా పేర్కొన్నారు.

మూడేళ్లలో: ఈ ప్రాజెక్టులో నాలుగు ప్యాకేజీలను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) కింద చేపడుతున్నారు. అంటే గుత్తేదారు సంస్థ కోట్ చేసిన మొత్తంలో 40 శాతాన్ని నిర్మాణ సమయంలో ప్రభుత్వం దశల వారీగా చెల్లిస్తుంది. మిగిలిన 60 శాతం నిధులను గుత్తేదారు సంస్థ సొంత నిధులు గానీ, బ్యాంక్ రుణం ద్వారా గానీ సమకూర్చుకోవచ్చు. ఆ మొత్తాన్ని ప్రభుత్వం 10-15 ఏళ్లపాటు వడ్డీతో సహా చెల్లిస్తుంది. ఓఆర్ఆర్ నాలుగు ప్యాకేజీలను 1,095 రోజులు (మూడేళ్ల)లో పూర్తిచేయాలని టెండరులో పేర్కొన్నారు.



దిల్లీలోని ఎన్‌హెచ్ఏఐ ప్రధాన కార్యాలయం ఈ టెండర్లను పర్యవేక్షిస్తుంది.ఓఆర్ఆర్ ప్రత్యేకతలు: ఇది ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 23 మండలాల్లో 97 గ్రామాల మీదుగా వెళ్తుంది. గంటకు 100 కి.మీ. వేగంతో వాహనాలు పరుగులు పెట్టేలా డిజైన్ స్పీడ్ ఉంటుంది. ఆరు జాతీయ రహదారులు, ఏడు రాష్ట్ర రహదారులు, ఒక జిల్లా రహదారిని క్రాస్ చేసుకుంటూ వెళ్తుంది. మూడుచోట్ల 2.78 కి.మీ., 1.69 కి.మీ., 0.51 కి.మీ. కలిపి మొత్తం 4.98 కి.మీ. మేర సొరంగాలు నిర్మిస్తారు. కృష్ణా నదిపై 2.90 కి.మీ., 5.30 కి.మీ.లతో మొత్తం 8.2 కి.మీ. మేర రెండు వంతెనలు నిర్మిస్తారు. మధ్యలో వాగులు, వంకలు తదితరాలు ఉన్నచోట్ల 20 పెద్ద, 95 చిన్న వంతెనలు నిర్మించనున్నారు. ఓఆర్ఆర్‌కు ఇటు, అటూ ఉండే గ్రామాలకు చెందినవాళ్లు రాకపోకలు సాగించేందుకు వీలుగా 105 అండర్‌పాస్‌లు నిర్మిస్తారు. 8 చోట్ల రోడ్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఓఆర్ఆర్ 34 చోట్ల ఎక్స్‌ట్రా హైటెన్షన్ లైన్స్ (ఈహెచ్‌టీ విద్యుత్ లైన్స్) క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు ఐదు జిల్లాల్లో కలిపి 3,251.41 హెక్టార్లు భూసేకరణ చేస్తారు. ఇప్పటికే వీటి కోసం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు.

# ఉపాధ్యాయుల కేడర్ ఖరారు - జిల్లా స్థాయిలోనే ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు

## 95 శాతం పోస్టులు స్థానికులకే

రాష్ట్రంలో ఉపాధ్యాయుల కేడర్, స్థానికతను నిర్ధారిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, వారి సమాన కేడర్ ఉద్యోగులను జిల్లా కేడర్‌గా ప్రభుత్వం ప్రకటించింది.రాష్ట్రంలో ఉపాధ్యాయుల కేడర్, స్థానికతను నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 కు అనుగుణంగా సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, వారి సమాన కేడర్ ఉద్యోగులను జిల్లా కేడర్‌గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నిబంధనలను నిర్దేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి.సాయి ప్రసాద్ వేర్వేరు జీవోలు విడుదల చేశారు.మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే 23 రకాల టీచర్లను జిల్లా కేడర్‌లో చేర్చారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. అలాగే, పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే 27 రకాల టీచర్లను సైతం జిల్లా కేడర్‌గా నిర్ధారించింది. ఇందుకు సంబంధించి జీవోను జారీ చేసింది. తాజా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ఉత్తర్వులతో రాష్ట్రంలో సుమారు లక్ష మంది వరకు ఉన్న ఎస్జీటీలు




జిల్లా లోకల్ కేడర్ పరిధిలోకి వచ్చారు. అలాగే దాదాపు 70 వేల వరకు ఉన్న స్కూల్ అసిస్టెంట్ల కేడర్ కూడా జిల్లా స్థాయిలోనే ఖరారైంది.ఏ పోస్టు ఏ కేడర్ కిందకంటే : ప్రభుత్వ పాఠశాలలు, ఎంపీపీ, జెడ్పీపీల్లో పనిచేసే గ్రేడ్-2 (గెజిటెడ్) ప్రధానోపాధ్యాయుల పోస్టులను మాత్రం ప్రభుత్వం 'జోనల్ కేడర్'గా నిర్ధారించింది. ఇక జిల్లా కేడర్ పరిధిలోకి వచ్చే పోస్టుల వివరాలను స్పష్టంగా పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు జిల్లా కేడర్ కిందికే వస్తారు. వీరితో పాటు ఈఎల్‌టీసీ ఆఫీసర్ ఇన్‌ఛార్జి, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు, హిందీ లాంగ్వేజ్ పండిట్‌లు, క్రాఫ్ట్, ఆర్ట్, డ్రాయింగ్, మ్యూజిక్, కుట్టు, వీవింగ్ టీచర్లు ఉన్నారు. అలాగే ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి తదితర మొత్తం 27 రకాల పోస్టులన్నీ జిల్లా కేడర్ పరిధిలోకే వస్తాయి.95 శాతం స్థానికులకే : ఉద్యోగ నియామకాల విషయంలో ఈ ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ జిల్లా కేడర్ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసేటప్పుడు, 95 శాతం పోస్టులకు ఆయా జిల్లాల స్థానిక అభ్యర్థులే అర్హులుగా ఉంటారు. జిల్లా కేడర్ పోస్టులన్నింటికీ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) అపాయింటింగ్ అథారిటీ (నియామక అధికారి)గా వ్యవహరిస్తారు. ఇక జోనల్ స్థాయి పోస్టులైన గ్రేడ్-2 హెచ్ఎంలకు పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు అపాయింటింగ్ అథారిటీగా వ్యవహరిస్తారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# ప్రభుత్వంపై వ్యతిరేకతే మన బలం రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో విజయంపై బీఆర్ఎస్ వ్యూహరచన

అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమ రాజకీయ బలాన్ని పరీక్షించుకునే అవకాశంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బీఆర్ఎస్ చూస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, అది తమకు కలిసి వస్తుందన్న ఆశాభావంతో గులాబీ పార్టీ కనిపిస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. రాజధాని హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి. ఆరేళ్ల క్రితం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. అయితే రెండున్నరేళ్ల క్రితం జరిగిన ఉపఎన్నికలో ఒక స్థానాన్ని ఆ పార్టీ కోల్పోయింది. దీంతో రానున్న రెండు పట్టభద్రుల స్థానాల ఎన్నికలు ప్రధాన ప్రతిపక్షానికి కీలకంగా మారాయి.

### కీలకంగా భావిస్తున్న బీఆర్ఎస్ అగ్రనేతలు

ఏడాదిన్నర క్రితం జరిగిన ఉత్తర తెలంగాణ పట్టభద్రుల ఎన్నికలో బీఆర్ఎస్ తమ అభ్యర్థిని బరిలో దింపలేదు. సాధారణ అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండేళ్ల సమయం ఉన్న నేపథ్యంలో... ఫిబ్రవరిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బీఆర్ఎస్ కీలకంగా భావిస్తోంది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తామని అంచనాతో ఉన్న బీఆర్ఎస్.. పట్టభద్రుల ఎన్నికల ఫలితాలను భవిష్యత్ రాజకీయాలకు అనుకూల సంకేతంగా మలుచుకోవాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది.

### సన్నాహక సమావేశాలతో జోష్

ఎమ్మెల్సీ ఎన్నికలపై ఇప్పటికే పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి వంద మంది ఓటర్లకు ఒకరు చొప్పున బాధ్యులను నియమించి వారి నమోదు, పోలింగ్ వరకు పర్యవేక్షించాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు ప్రారంభమయ్యాయి.

### మళ్లీ రాకేష్ రెడ్డికే ఛాన్స్

వరంగల్ -- నల్గొండ -- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ




స్థానానికి అభ్యర్థి విషయంలో బీఆర్ఎస్‌లో దాదాపు స్పష్టత వచ్చినట్లు సమాచారం. గత ఉపఎన్నికలో పోటీ చేసి ఓటమి పాలైన రాకేష్ రెడ్డికే మరోసారి అవకాశం కల్పించే అంశాన్ని పార్టీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే స్థానం నుంచి వాసుదేవరెడ్డి కూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు.మహబూబ్‌నగర్ -- రంగారెడ్డి -- హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మాత్రం అభ్యర్థి ఎంపికపై బీఆర్ఎస్‌లో విస్తృత చర్చ జరుగుతోంది. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల పేర్లు కొన్ని తెరపైకి వచ్చినప్పటికీ వారు పోటీకి అంతగా ఆసక్తి చూపడం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, నాగేందర్ గౌడ్, కాసాని వీరేశం తదితరులు అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారు.

### బీసీలకు ఇవ్వాలని ప్రతిపాదన

మరోవైపు పార్టీకి చెందిన నేతలతో పాటు తటస్థుల వైపు కూడా బీఆర్ఎస్ నాయకత్వం దృష్టి సారించింది. రెండు స్థానాల్లో ఒక స్థానాన్ని బీసీ సామాజికవర్గానికి కేటాయించాలన్న చర్చ కూడా పార్టీలో జరుగుతోంది. కాంగ్రెస్ రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోకి దింపిన నేపథ్యంలో.. బీఆర్ఎస్ తరఫున ఒక బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వడం ద్వారా సామాజిక సమీకరణాలను బలోపేతం చేయవచ్చని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు.

### ఓటర్ నమోదుపై ప్రధానంగా దృష్టి

ఫిబ్రవరిలో ఎన్నిక జరగనున్నందున ఇపుడే అభ్యర్థి ఖరారు అవసరం లేదన్న భావనలో బీఆర్ఎస్ నాయకత్వం ఉంది. అభ్యర్థుల ఎంపిక కంటే ముందు ఓటర్ల నమోదు ప్రక్రియను కీలకంగా భావిస్తున్న బీఆర్ఎస్.. ప్రస్తుతం పార్టీ పరంగా పూర్తి స్థాయిలో దానిపైనే దృష్టి సారిస్తోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, నిరుద్యోగులు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ఈ వర్గాల ఓట్లు తమకు అనుకూలంగా మారతాయని పార్టీ ఆశాభావంతో ఉంది.

### రంగంలోకి దిగనున్న గులాబీ బాస్

మరోవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ అధినేత కేసీఆర్ కూడా త్వరలో ఆరు ఉమ్మడి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల వ్యూహం, ఓటర్ల నమోదు, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి ప్రచారంపై గులాబీ బాస్ దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

# 'బ్లూ బుల్లెట్'కు గోల్డెన్ జూబ్లీ నేటితో 50 వసంతాలు పూర్తి చేసుకున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్



రాష్ట్ర రాజధాని హైదరాబాద్, దేశ రాజధాని దిల్లీని కలుపుతూ నడుస్తున్న 'తెలంగాణ ఎక్స్‌ప్రెస్' రైలును ప్రారంభించి నేటి (శనివారం)తో అర్ధ శతాబ్దం పూర్తయింది. దీనిని 1976 అక్టోబరు 3న ప్రారంభించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను దేశ రాజధాని న్యూదిల్లీని కలుపుతూ తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఐదు దశాబ్దాలుగా లక్షలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తోంది. నేటితో ఈ రైలు 50 వసంతాలను (గోల్డెన్ జూబ్లీ) పూర్తి చేసుకుంది. ఈ రైలును 1976 అక్టోబరు 3న ప్రారంభించారు. ఇది శనివారంతో 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం విశేషం. తెలుగు వారికి దిల్లీ వెళ్లాలంటే ముందుగా గుర్తొచ్చే రైలు ఇదే.

### 'బ్లూ బుల్లెట్'గా సంచలనం

ఈ రైలును 1976 అక్టోబర్ 3న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం జలగం వెంగళరావు, రైల్వే శాఖ మంత్రి మధు దంతావతే చేతుల మీదుగా 'ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్' పేరిట ప్రారంభించారు. ఈ రైలును ప్రారంభించిన రోజుల్లోనే అత్యంత వేగంగా ప్రయాణించే సూపర్ ఫాస్ట్ రైలుగా గుర్తింపు తెచ్చుకుంది. ఈ రైలుకు వేసిన ప్రత్యేక ఆక్స్‌ఫర్డ్ బ్లూ, బంగారు రంగుల కారణంగా ప్రయాణికులు, రైల్వే అభిమానులు దీనిని 'బ్లూ బుల్లెట్' అని ముద్దుగా పిలుచుకునేవారు.

### విలాసంవతమైన, వేగవంతమైన ప్రయాణ సాధనం

ప్రస్తుతం వందేభారత్, రాజధాని వంటి విలాసవంతమైన రైళ్లు అందుబాటులో ఉన్నాయి. అయితే అప్పట్లో వాటిని ప్రవేశపెట్టక ముందు, తెలుగు గడ్డ నుంచి దేశ రాజధానికి వెళ్లేందుకు ఇదే అత్యంత విలాసంవతమైన, వేగవంతమైన ప్రయాణ సాధనం. అయితే దీనిని ప్రారంభించిన రోజుల్లో కేవలం కాజీపేట జంక్షన్‌లో మాత్రమే స్టాప్ ఉండేది. తర్వాత కొన్ని సంవత్సరాలకు రామగుండంలో దీనికి స్టాప్ కల్పించారు. 1991లో మంచిర్యాలలో, ఆ తర్వాత బెల్లంపల్లిలో స్టాప్ ఏర్పాటు చేశారు. కాగా ప్రస్తుతం పెద్దపల్లి జంక్షన్‌లో స్టాప్ సదుపాయం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు."తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం దక్షిణ మధ్య రైల్వేకు ఒక కీలకమైన మైలురాయిగా, గర్వకారణంగా చెప్పుకోవచ్చు. ఈ రైలును సమర్థంగా కొనసాగించడానికి కృషి చేసిన రైల్వే ఉద్యోగుల సహకారాన్ని గుర్తించడానికి ఇది ఓ సందర్భం" - శ్రీధర్, దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో

### నాటి నుంచి నేటి దాకా

ఈ రైలును ప్రారంభించిన తొలినాళ్లలో డీజిల్ ఇంజిన్‌తో 14 కోచ్‌లతో నడిచేది. అయితే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 1981 నాటికి ట్విన్ డీజిల్ ఇంజిన్‌తో 21 కోచ్‌లకు అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం లాలాగూడ లోకో షెడ్‌కు చెందిన శక్తిమంతమైన విద్యుత్ ఇంజిన్‌తో 24 కోచ్‌లతో దీనిని నడుపుతున్నారు.

### ఆ రోజుల్లోనే 23 గంటల్లోపే దిల్లీకి

ఈ రైలును ప్రారంభించిన సమయం 1976లో సింగిల్ లైన్ ట్రాక్‌లు, పాత సిగ్నలింగ్ వ్యవస్థలు ఉండేవి. అయినప్పటికీ, సికింద్రాబాద్ నుంచి దేశ రాజధాని దిల్లీకి కేవలం 23 గంటల్లోపే చేర్చేది. అయితే తర్వాత ఈ రైలుకు స్టాప్‌లు పెరగడంతో సమయం కాస్త పెరుగుతూ వచ్చింది. నేడు 1,677 కిలోమీటర్ల దూరాన్ని 16 స్టాప్‌లతో కేవలం 26 గంటల 30 నిమిషాల్లోనే చేరుస్తోంది.

### రాష్ట్ర విభజనతో మారిన పేరు

2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఈ రైలు పేరును కూడా మార్చాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. దీంతో 2015 నవంబరు 15న ఈ రైలు పేరును అధికారికంగా 'తెలంగాణ ఎక్స్‌ప్రెస్'గా మార్చారు.

# పన్నుల రాబడుల్లో 'భారీ' పురోగతి రాష్ట్ర ఖజానాకు రూ.44,372 కోట్ల ఆదాయం



రాష్ట్రంలో ఈ ఆర్థిక ఏడాది తొలి ఆరు నెలల పన్నులతో గణనీయంగా ఆదాయం సమకూరింది. కిందటి ఏడాదితో పోలిస్తే 16శాతం వృద్ధి నమోదైంది. అధిక భాగం జీఎస్టీ రూపంలో రాగా సెప్టెంబర్‌లోనే అత్యధికంగా వచ్చింది. పన్నుల రాబడుల్లో రాష్ట్రం గణనీయ పురోగతి సాధించింది. పన్నుల ఆదాయంలో వరుసగా వృద్ధి నమోదైంది. జీఎస్టీతో పాటు ఇతర రాబడులు కూడా గత ఆర్థిక ఏడాది కంటే అధికంగా వచ్చాయి. ఈ ఆర్థిక ఏడాది తొలి ఆరు నెలల్లో వాణిజ్య పన్నుల శాఖ రూ.44,372 కోట్ల రాబడులను తెచ్చిపెట్టగా, గత ఏడాది ఇదే ఆరు నెలల్లో రూ.38,267 కోట్లు మాత్రమే వచ్చాయి. అంటే కిందటి తొలి రెండు త్రైమాసికాల ఆదాయంతో పోలిస్తే ఈసారి దాదాపు 16 శాతం వృద్ధి నమోదైంది.గతేడాదితో పోలిస్తే మెరుగైన వృద్ధి రాష్ట్రంలో ఈ నెల కూడా వాణిజ్య పన్నుల్లో వృద్ధి నమోదైంది. ఈ ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల కాలంలో వచ్చిన రాబడులను గత ఆర్థిక ఏడాదిలో ఇదే ఆరు నెలల్లో వచ్చిన మొత్తాలతో పోలిస్తే 16 శాతం వృద్ధి నమోదు చేసింది. గత ఆర్థిక ఏడాది మొదటి ఆరు నెలల్లో రూ.38,267 కోట్లు రాబడులు రాగా, ఈ ఆర్థిక ఏడాది అదే మొదటి ఆరు నెలల్లో రూ.44,372 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే ఏకంగా రూ.6,105 కోట్లు అదనంగా రాబడులు వచ్చినట్లు వాణిజ్య పన్నుల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

### సెప్టెంబర్‌లోనే అధిక ఆదాయం

రాష్ట్రానికి వాణిజ్య పన్నుల శాఖ ద్వారా జీఎస్టీ, పెట్రోల్, డీజిల్, మద్యం విక్రయాలపై వచ్చే వ్యాట్, వృత్తి పన్ను తదితర నాలుగు రకాల రాబడులు ఉంటాయి. వీటిలో సింహభాగం జీఎస్టీ ద్వారా వస్తుంది. జీఎస్టీ మొదటి నుంచి వృద్ధి నమోదు చేస్తూ వస్తోంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జీఎస్టీ ద్వారా తెలంగాణకు రూ.25,048 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే ఆరు నెలల్లో రూ.21,493 కోట్లు మాత్రమే వచ్చినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. అంటే రూ.3,555 కోట్ల అదనపు రాబడి నమోదైంది. ఒక్క సెప్టెంబర్‌లోనే గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 15 శాతం వృద్ధి నమోదు చేసి ఏకంగా రూ.538 కోట్లు అదనంగా రాబడి తెచ్చి పెట్టింది.

### వృత్తి పన్నులో మార్పు రాలేదు

ఇక పెట్రోల్ విక్రయాలపై వచ్చిన వ్యాట్ రాబడులు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రూ.9,615 కోట్లు కాగా, గత ఏడాది ఇదే కాలంలో రూ.8,363 కోట్లు వచ్చాయి. అంటే దాదాపు రూ.1,252 కోట్ల అదనపు రాబడితో 15 శాతం వృద్ధి నమోదు చేసింది. ఒక్క సెప్టెంబర్‌లోనే రూ.1,613 కోట్లు వచ్చాయి. కిందటి ఏడాది సెప్టెంబర్‌లో రూ.1,287 కోట్లతో పోలిస్తే రూ.326 కోట్ల పెరుగుదల నమోదు అయ్యింది. ఇది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం కంటే అధికం.మద్యం అమ్మకాలపై వ్యాట్ ఆదాయం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రూ.9,210 కోట్లు కాగా, గత సంవత్సరం ఇదే కాలానికి రూ.8,345 కోట్లు మాత్రమే సమకూరింది. అంటే దాదాపు రూ.865 కోట్ల అదనపు రాబడి వచ్చింది. దీంతో సుమారు 10 శాతం వృద్ధి నమోదైంది. వృత్తి పన్ను మాత్రం భిన్నమైన ధోరణిని చూపించింది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం రూ.499 కోట్లకు గానూ గత ఏడాది కూడా ఇదే కాలంలో మొత్తం రూ.499 కోట్లే వచ్చాయి. అంటే ఈ రంగంలో ఆరు నెలల మొత్తంలో పెద్దగా మార్పు లేదు.

# నిన్న మణికొండ నేడు పెద్ద అంబర్‌పేట్ గేటెడ్ కమ్యూనిటీలో చెడ్డీ గ్యాంగ్ బీభత్సం

భాగ్యనగర శివార్లలో 'చెడ్డీ గ్యాంగ్' మరోసారి పంజా విసిరింది. దుండగులు మణికొండలో ఫెన్సింగ్ కత్తిరించి కత్తులతో బీభత్సం సృష్టించారు. మరోమారు పెద్ద అంబర్‌పేట్‌లోని పలు ఇళ్లలో దోపిడీకి పాల్పడ్డారు. దీంతో నగరవాసులు భయాందోళనలకు గురవుతున్నారు.ఢభాగ్యనగర శివార్లలో 'చెడ్డీ గ్యాంగ్' మరోసారి పంజా విసిరింది. కాంక్రీట్ జంగిల్‌లోని గేటెడ్ కమ్యూనిటీలే లక్ష్యంగా ఈ ముఠా వరుస చోరీలకు పాల్పడుతుండటంతో నగర ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మణికొండలో ఫెన్సింగ్ కత్తిరించి కత్తులతో బీభత్సం సృష్టించిన దుండగులు, మరోమారు పెద్ద అంబర్‌పేట్‌లోని పలు ఇళ్లలో దోపిడీకి పాల్పడ్డారు.



### ఎవరూ రాలేరులే అని ధీమాగా ఉంటేదం

సాధారణంగా అపార్ట్‌మెంట్ వెనక వైపు పెద్ద చెరువో, లేదా దట్టమైన పొదలో ఉంటే అటువైపు నుంచి ఎవరూ రాలేరులే అని ధీమాగా ఉంటాం. కానీ సరిగ్గా అదే పాయింట్‌ను టార్గెట్ చేస్తూ దోపిడీలకు పాల్పడుతోంది చెడ్డీ గ్యాంగ్. తాజాగా మణికొండలోని నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధి నెక్నాంపూర్ ఫ్లోటిల్లా అపార్ట్‌మెంట్ వెనక చెరువు వైపున ఉన్న ఫెన్సింగ్‌ను కత్తిరించి సుమారు ఆరుగురు దొంగలు లోపలికి చొరబడ్డారు.

# టర్మ్ ఇన్సూరెన్స్ "పాలసీ" ఎంత ఉంటే కుటుంబానికి మంచిది



కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోకుండా దూరమైతే.. ఆ కుటుంబం ఆర్థికంగా సురక్షితంగా ఉండాలంటే బీమా తప్పనిసరి. అందుకే ప్రస్తుతం చాలా మంది బీమా పాలసీలు తీసుకుంటున్నారు. మరీ ముఖ్యంగా టర్మ్ ఇన్సూరెన్స్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే టర్మ్ పాలసీ తీసుకునేటప్పుడు "ఎంత కవరేజీ తీసుకుంటే కుటుంబానికి నిజమైన రక్షణ లభిస్తుంది" అనే ప్రశ్న వేసుకోవాలంటున్నారు నిపుణులు. ఎందుకంటే కుటుంబ బాధ్యతలు, అప్పులు, పిల్లల భవిష్యత్తు అవసరాలు ఇలా ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటాయంటున్నారు. అందుకే, అందరికీ ఒకే లెక్క వర్తించదని.. కుటుంబం ఆర్థికంగా ధైర్యంగా ఉండేందుకు అవసరమైన మొత్తాన్ని అంచనా వేసి, దానికి అనుగుణంగా టర్మ్ పాలసీని నిర్ణయించుకోవడం ముఖ్యం అంటున్నారు నిపుణులు. ఆ వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.సంపాదించే వ్యక్తి లేని లోటును భర్తీ చేయడమే టర్మ్ ఇన్సూరెన్స్ ప్రధాన లక్ష్యం అంటున్నారు నిపుణులు. ఒక వ్యక్తి కుటుంబానికి అందించే ఆదాయం ఆగిపోతే.. ఆ లోటును బీమా మొత్తం కొంత వరకూ భర్తీ చేయాలంటున్నారు. ఒకే ఆదాయం ఉన్న ఇద్దరు వ్యక్తుల బీమా అవసరం ఒకేలా ఉండదంటున్నారు. ఎందుకంటే ఒకరికి సొంత ఇల్లు ఉండొచ్చని.. అప్పులు లేకపోవచ్చని, మరొకరికి గృహరుణం, పిల్లల చదువులు, తల్లిదండ్రుల బాధ్యతలు ఉండొచ్చంటున్నారు. అందుకే, కేవలం జీతం ఆధారంగా బీమా మొత్తాన్ని నిర్ణయించడం సరైన పద్ధతి కాదని, కుటుంబానికి అవసరమైన టర్మ్ కవరేజీని అంచనా వేయడానికి ఒక సమగ్ర లెక్కింపు విధానాన్ని అనుసరించడం మంచిదంటున్నారు. సంపాదించే వ్యక్తి లేకపోయినా కుటుంబానికి అవసరమయ్యే ఆదాయాన్ని అంచనా వేయాలని, దానికి అదనంగా హోమ్, వెహికల్, పర్సనల్ రుణాలను కలపాలంటున్నారు. ఇక పిల్లల పై చదువులు, వివాహం వంటి భవిష్యత్తు ఆర్థిక లక్ష్యాలకు అవసరమయ్యే మొత్తాన్నీ యాడ్ చేయాలని.. ఆ తర్వాత ఇప్పటికే మన వద్ద ఉన్న ఆర్థిక ఆస్తులు, పెట్టుబడులు, పొదుపు, ఇతర జీవిత బీమా పాలసీలను మినహాయించాలంటున్నారు. ఇలా లెక్కించడం ద్వారా కుటుంబానికి వాస్తవంగా ఎంత బీమా రక్షణ అవసరమో ఒక అంచనాకు రావొచ్చని వివరిస్తున్నారు.టర్మ్ కవరేజీని నిర్ణయించేటప్పుడు ఇప్పటికే ఉన్న అప్పులకు ప్రాధాన్యం ఇవ్వాలంటున్నారు నిపుణులు. ముఖ్యంగా హోమ్ లోన్ కుటుంబంపై పెద్ద ఆర్థిక బాధ్యతగా మారొచ్చని.. ఎందుకంటే సంపాదించే వ్యక్తి లేకపోయినా రుణ బాధ్యత కొనసాగుతుందంటున్నారు. ఈ క్రమంలోనే తగినంత ఆర్థిక రక్షణ లేకపోతే కుటుంబ సభ్యులపై ఈ భారం పడే అవకాశం ఉంటుందని.. అందుకే బీమా మొత్తాన్ని నిర్ణయించేటప్పుడు "ప్రస్తుతం ఎంత రుణం ఉంది, ఇంకా ఎన్ని సంవత్సరాలు చెల్లించాలి కుటుంబంలోని మిగిలిన సభ్యులు ఆ బాధ్యతను భరించగలరా అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి వివరిస్తున్నారు.పిల్లల పై చదువులు, వివాహం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలనూ బీమా అవసరంలో ఒక భాగంగా చూడాలని సలహా ఇస్తున్నారు నిపుణులు. ఎందుకంటే భవిష్యత్తు అవసరాలను ప్రస్తుతం ఉన్న ఖర్చుల ఆధారంగానే లెక్కిస్తే, అంచనా తక్కువయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. విద్య, వైద్యం వంటి రంగాల్లో ఖర్చులు కాలక్రమంలో పెరగవచ్చని.. అందుకే, లక్ష్యం నెరవేరే సమయానికి ఎంత మొత్తం అవసరమవుతుందో అంచనా వేయాలని చెబుతున్నారు.'బీమా కవరేజీ ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచిది' అనే భావనా సరికాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇప్పటికే ఉన్న సేవింగ్స్, డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ పెట్టుబడులు, ఇతర ఆర్థిక ఆస్తులు కుటుంబానికి భవిష్యత్తులో ఉపయోగపడతాయని, వీటినీ మొత్తం అవసరంలోనే పరిగణనలోకి తీసుకోవాలని చెబుతున్నారు. ఇపట్పికే తగినంత ఆస్తులు ఉన్నప్పుడు.. అంతే స్థాయిలో అదనపు టర్మ్ కవరేజీ అవసరం ఉండకపోవచ్చని చెబుతున్నారు.జీవితం మారుతున్న కొద్దీ బీమా అవసరమూ మారుతుందని నిపుణులు వివరిస్తున్నారు. ఎందుకంటే వివాహం, పిల్లలు, కొత్త ఇల్లు, గృహరుణం, ఆదాయంలో గణనీయమైన పెరుగుదల, తల్లిదండ్రుల బాధ్యత వంటి మార్పులు వచ్చినప్పుడు కవరేజీని అలానే ఉంచకుండా మరోసారి పరిశీలించాలని వివరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒకేసారి భారీ మొత్తంలో పాలసీ తీసుకోవడం కంటే.. అవసరాలు పెరిగే కొద్దీ అదనపు టర్మ్ పాలసీలతో రక్షణను పెంచుకునే విధానాన్ని అనుసరించవచ్చని వివరిస్తున్నారు. ఇలా అదనపు కవరేజీ తీసుకునే ముందు పాలసీల రూల్స్, ప్రీమియం భారం, మొత్తం రక్షణ అవసరాన్ని పరిశీలించాలని వివరిస్తున్నారు.టర్మ్ పాలసీ తీసుకున్న తర్వాత దాన్ని అలాగే వదిలేయకూడదని.. మూడు నుంచి అయిదేళ్లకోసారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని సమీక్షించుకోవడం అవసరం అంటున్నారు. ఆదాయం ఎంత పెరిగింది కొత్తగా ఏమైనా అప్పులు వచ్చాయా పిల్లల భవిష్యత్తు అవసరాలు ఎలా మారాయి పెట్టుబడులు ఎంత పెరిగాయి ఇప్పటికే ఉన్న బీమా సరిపోతుందా వంటి అంశాలను పరిశీలించాలంటున్నారు.

# ఇన్వెస్టర్లకు పండుగలాంటి వార్త.. రూ.37 వేల కోట్ల జియో ఐపీఓ..!




ఇన్వెస్టర్లు ఎంతగానో ఎదురు చూస్తున్న జియో ఐపీఓ గురించి అప్డేట్ వచ్చింది. జియో తన ఐపీఓ ద్వారా రూ.37 వేలు కోట్లు సేకరించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ తన ప్రతిపాదిత ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ కోసం 19 జూన్ 2026న సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా కి తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ను దాఖలు చేసింది. దీనికి 28 ఆగస్టు 2026న నియంత్రణ సంస్థ నుంచి ఒక పరిశీలన లేఖ అందింది. ప్రతిపాదిత జియో ప్లాట్‌ఫామ్స్ అనేది 100 శాతం బుక్-బిల్ట్ ఫ్రెష్ ఇష్యూగా రానుంది. దీని ద్వారా ఒక్కో షేరు ముఖ విలువ రూ.10తో, గరిష్ఠంగా 27 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నారు. ఈ ఇష్యూలో ప్రస్తుతం ఆఫర్-ఫర్-సేల్ అంశం లేదు. ఈ 27 కోట్ల షేర్ల ఇష్యూ తర్వాత కంపెనీ చెల్లించే ఈక్విటీ మూలధనంలో 2.9% వాటాను సూచిస్తాయి. జియో ప్లాట్‌ఫామ్స్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రమోట్ చేస్తోంది. 31 మార్చి 2026 నాటికి జియో ప్లాట్‌ఫామ్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 66.43% వాటాను కలిగి ఉంది. ఆర్థిక, వ్యూహాత్మక పెట్టుబడిదారుల బృందం, ఇతర వాటాదారులు మిగిలిన యాజమాన్యాన్ని కలిగి ఉన్నారు. ప్రతిపాదిత షేర్లను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ రెండింటిలోనూ లిస్ట్ చేయనున్నారు. ఈ ఇష్యూకు కేఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్‌ను రిజిస్ట్రార్‌గా నియమించగా, ఈ ఆఫరింగ్‌ను నిర్వహించడానికి 19 మంది సభ్యులతో కూడిన బుక్-రన్నింగ్ లీడ్ మేనేజర్ల బృందాన్ని నియమించారు. 6 రోజుల్లో 48 శాతం పడిపోయిన పీబీ ఫిన్ టెక్ షేర్లు..! ఈ సిండికేట్‌లో కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, మోర్గాన్ స్టాన్లీ ఇండియా, బోఫా సెక్యూరిటీస్ ఇండియా, యాక్సిస్ క్యాపిటల్, బీఎన్‌పీ పారిబాస్, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, గోల్డ్‌మన్ సాక్స్ (ఇండియా) సెక్యూరిటీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌ఎస్‌బిసి సెక్యూరిటీస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్ ఇండియా, ఐసిఐసిఐ సెక్యూరిటీస్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, జెఫరీస్ ఇండియా, జేఎం ఫైనాన్షియల్, జేపీ మోర్గాన్ ఇండియా, ఎస్‌బిఐ క్యాపిటల్ మార్కెట్స్, యూబీఎస్ సెక్యూరిటీస్ ఇండియా, సిఎల్ఎస్ఏ ఇండియా, డీఏఎం క్యాపిటల్ అడ్వైజర్స్, 360 వన్ డబ్ల్యూఏఎం ఉన్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ విలువ దాదాపు రూ. 37,700 కోట్లు లేదా దాదాపు ̆3.8 బిలియన్లుగా ఉంటుందని మార్కెట్ అంచనా వేస్తోంది. ఈ ఆఫరింగ్ 2024లో హ్యుందాయ్ మోటార్ ఇండియా జారీ చేసిన రూ.27,870 కోట్ల ఐపీఓ కంటే ఎక్కువ. జియో ఐపీఓ ద్వారా వచ్చిన నిధులు, జియో ప్లాట్‌ఫామ్స్ ముఖ్య అనుబంధ సంస్థ అయిన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ (ఆర్‌జేఐఎల్) బ్యాలెన్స్ షీట్‌ను బలోపేతం చేయడానికి ఉపయోగించనున్నారు. డీఆర్‌హెచ్‌పీ ప్రకారం నికర నిధులను ఆర్‌జేఐఎల్ కొన్ని బకాయి రుణాలను పూర్తిగా లేదా పాక్షికంగా ముందస్తుగా చెల్లించడానికి ఉపయోగిస్తారు. మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం వినియోగిస్తారు. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా వచ్చే నిధులలో ఆర్‌జేఐఎల్ తీసుకున్న రుణాలు దాదాపు రూ.27,500 కోట్లుగా ఉన్నాయి. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సాధారణ ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మధ్య తేడా ఏంటి..!




బ్యాంకుల సాధారణ రేట్ల కంటే ప్రత్యేక కాలపరిమితి గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ రేట్లను అందిస్తాయి. అయితే వాటి నుంచి వచ్చే అదనపు రాబడి చాలా తక్కువగా ఉండవచ్చని, డిపాజిట్ నుంచి ముందుగానే నిష్క్రమించడానికి అయ్యే ఖర్చులు ఎక్కువ ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. బ్యాంకులు ఈ మధ్యకాలంలో 444 రోజులు, 555 రోజుల వంటి అసాధారణ కాలపరిమితులతో డిపాజిట్లను అందిస్తున్నాయి. ఉదాహరణకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమృత్ వృద్ధి 444 రోజుల కాలపరిమితిని అందిస్తుండగా, ఇండియన్ బ్యాంక్ సెక్యూర్ కూడా 444 రోజుల డిపాజిట్ అందిస్తోంది. బ్యాంక్ ఆఫ్ బరోడా 555 రోజుల గోల్డెన్ గోల్ డిపాజిట్‌ను అందించింది. ఇటువంటి పథకాలు సాధారణ డిపాజిటర్లకు దాదాపు 6.45-6.75% రాబడిని అందిస్తుండగా, సీనియర్ సిటిజన్లు దాదాపు 0.5 శాతం పాయింట్లు అధికంగా పొందుతున్నారు. అయితే పెట్టుబడిదారులు కేవలం ప్రధాన రేటుకే పరిమితం కాకుండా, పోల్చదగిన సాధారణ శ్రేణిపై లభించే అసలు ప్రీమియంను కూడా లెక్కించాలని నిపుణులు చెబుతున్నారు. ఎస్బీఐ 444-రోజుల అమృత్ వృష్టి 6.45 శాతం వడ్డీని అందించగా, దాని సాధారణ ఒకటి నుంచి రెండు సంవత్సరాల డిపాజిట్ బకెట్ 6.25 శాతం వడ్డీని అందించింది. అందువల్ల ఈ వ్యత్యాసం కేవలం 20 బేసిస్ పాయింట్లు మాత్రమే. 444 రోజుల కాలానికి రూ.5 లక్షల పెట్టుబడిపై ఈ ప్రత్యేక ఎఫ్‌డీ దాదాపుగా రూ.40,472 వడ్డీని అందిస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ దారులకు అలర్ట్.. నేటి నుంచి మారనున్న ఎఫ్డీ రూల్స్..! అదే 6.25 శాతం వడ్డీతో సాధారణ ఎఫ్డీపై వచ్చే రూ.39,179తో పోలిస్తే ఇది ఎక్కువ. అంటే పన్నుకు ముందు అదనపు వడ్డీ దాదాపు రూ.1,293 ఉంటుంది. 30 శాతం పన్ను శ్లాబ్ కింద ఈ అదనపు ఆదాయం దాదాపు రూ.905కు పడిపోతుంది. మెచ్యూరిటీకి ముందే పెట్టుబడిదారునికి డబ్బు అవసరమైతే ఈ ప్రయోజనం పూర్తిగా మాయమైపోవచ్చు. ఒక సంవత్సరం తర్వాత రూ.5 లక్షల ప్రత్యేక శ్రేణిని రద్దు చేసుకుంటే, పెట్టుబడిదారుడు తక్కువ కాలానికి వర్తించే తక్కువ వడ్డీ రేటుతో పాటు, గడువుకు ముందే డబ్బు ఉపసంహరించుకున్నందుకు జరిమానాను కూడా చెల్లించాల్సి రావచ్చు. ఉదాహరణంగా ఎస్బీఐ 0.5 శాతం పాయింట్ల జరిమానా తర్వాత ప్రభావవంతమైన రేటు 5.75%గా ఉంది. 6.25% వడ్డీతో తీసుకునే సాధారణ ఒక సంవత్సరం నుంచి వచ్చే సుమారు రూ.31,990తో పోలిస్తే, దీని ఫలితంగా వచ్చే వడ్డీ రూ.29,376గా అంచనా వేశారు. ప్రత్యేక కాలపరిమితి గల డిపాజిట్‌ను ఎంచుకుని ఒక సంవత్సరం తర్వాత డబ్బు విత్‌డ్రా చేసుకోవడం ద్వారా పెట్టుబడిదారుడు దాదాపు రూ.2,614 నష్టపోవచ్చు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న డిపాజిట్లలో ప్రత్యేక ఎఫ్డీ తప్పనిసరిగా అత్యధిక రాబడినిచ్చేది కాదని నిపుణులు చెబుతున్నారు. సెప్టెంబర్ 2026 నాటికి 444-రోజుల డిపాజిట్లపై బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ 6.60% వడ్డీని అందిస్తున్నాయి. ఇది ఎస్బీఐ 6.45% రేటు కంటే ఎక్కువ. పెట్టుబడి పెట్టే ముందు పెట్టుబడిదారులు గడువుకు ముందే డబ్బు విత్‌డ్రా చేసుకునే నిబంధనలు, కచ్చితమైన మెచ్యూరిటీ తేదీ, పన్ను తర్వాత వచ్చే రాబడిని తనిఖీ చేసుకోవాలి. సాధారణ బ్యాంక్ డిపాజిట్లకు వర్తించే నిబంధనల ప్రకారమే ప్రత్యేక కాలపరిమితి గల డిపాజిట్లకు కూడా డిపాజిట్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇన్సూరెన్స్ కింద వడ్డీతో సహా ఒక్కో బ్యాంకులో ఒక్కో డిపాజిటర్‌కు రూ.5 లక్షల పరిమితి ఉంది. సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల 8.5 శాతం వడ్డీ రేట్లు చెల్లిస్తున్న బ్యాంకులు ఇవే..! డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఛార్జీలకు ముందే దేశంలో తగ్గిన యూపీఐ పేమెంట్స్..




యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు తగ్గుముఖం పట్టాయి. ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబర్ లో యూపీఐ లావాదేవీలు 1.8 శాతం తగ్గాయి.నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆగస్టులో 2,450 కోట్ల లావాదేవీలు నమోదు కాగా, సెప్టెంబర్‌లో ఇవి 2,407 కోట్లకు తగ్గాయి . లావాదేవీల మొత్తం విలువ కూడా 1.50 శాతం క్షీణించి రూ.29.82 లక్షల కోట్ల నుంచి రూ.29.37 లక్షల కోట్లకు చేరిది. పెద్ద మొత్తంలో జరిగే యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీల అమలుకు కొన్ని రోజుల ముందు ఈ లెక్కలు రావడం గమనార్హం.నెలవారీగా స్వల్ప తగ్గుదల ఉన్నప్పటికీ, ఏడాది ప్రాతిపదికన లావాదేవీల సంఖ్య 23 శాతం పెరిగింది. లావాదేవీల విలువ ఏడాది ప్రాతిపదికన 18% వృద్ధిని నమోదు చేసింది. సెప్టెంబర్‌లో రోజుకు సగటున 802 మిలియన్ల లావాదేవీలను నిర్వహించిందని, సగటు రోజువారీ లావాదేవీల విలువ సుమారు రూ.97,913 కోట్లుగా ఉందని తెలిపింది. ఆగస్టులో యూపీఐ 24.51 బిలియన్ల లావాదేవీలను నమోదు చేసి, ఏడాది ప్రాతిపదికన 22% వృద్ధిని సాధించింది. ఆ నెలలో ఈ వ్యవస్థ రూ.29.82 లక్షల కోట్ల విలువైన లావాదేవీలను నిర్వహించింది, ఇది అంతకుముందు ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 20% ఎక్కువ. ఓటీపీ, పిన్ లేకుండా స్మార్ట్ వాచ్ తో పేమెంట్.. అందుబాటులోకి యాపిల్ పే..! సవరించిన విధానం, రోజువారీ డిజిటల్ చెల్లింపులను ఉచితంగా ఉంచుతూనే, లావాదేవీల రకం విలువ ఆధారంగా శ్రేణుల వారీగా రుసుము నిర్మాణాన్ని ప్రతిపాదిస్తోంది. వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలకు లావాదేవీ మొత్తంతో సంబంధం లేకుండా ఎటువంటి రుసుము (0%) ఉండదు. అదేవిధంగా రూ.2,000 వరకు జరిగే వ్యక్తి-నుండి-వ్యాపారి లావాదేవీలు ఉచితంగానే ఉంటాయి. చిన్న వ్యాపారులు వరుసగా మూడు నెలల పాటు నెలకు రూ.1 లక్ష కంటే తక్కువ వసూళ్లను కలిగి ఉంటే, వారికి మర్చంట్ రుసుముల నుంచి మినహాయింపు లభిస్తుంది. రూ.2,000 పైబడిన 2వీ లావాదేవీలకు, ప్రామాణిక వీణ=ను 0.4%గా ప్రతిపాదించారు. దీనికి గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. ఈ పరిమితి రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు వర్తిస్తుంది. తద్వారా అధిక విలువ గల చెల్లింపులపై రుసుమును పరిమితం చేస్తుంది. తక్కువ మార్జిన్లు లేదా ప్రత్యేక చెల్లింపు అవసరాలు ఉన్న కొన్ని రంగాలకు తక్కువ ఛార్జీలు ఉంటాయి. యుటిలిటీస్, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధనం, రైల్వేలు, విద్యారంగంలో రూ.2,000 పైబడిన లావాదేవీలకు ఫ్లాట్ రూ.5 రుసుము వర్తిస్తుంది.

# చారిత్రక స్వర్ణం గెలిచాక భారత హాకీ అమ్మాయిల సంబరాలు అదరహో!

- ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టుకు స్వర్ణం
- 44 ఏళ్ల తర్వాత చారిత్రక విజయం నమోదు
- ఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాపై 1-0 తేడాతో గెలుపు
- విజయంతో లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత
- గోల్ కీపర్ సవితా పూనియా అద్భుత ప్రదర్శన



ఫైనల్ హూటర్ మోగింది.. ఆ వెంటనే భారత మహిళల హాకీ జట్టు సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 44 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ సాధించిన స్వర్ణ పతకంతో వారి కళ్లు ఆనందబాష్పాలతో నిండిపోయాయి. ఒకరినొకరు ఆనందంతో హత్తుకుంటూ, మైదానంలోనే భావోద్వేగంతో సంబరాలు జరుపుకున్నారు. డ్యాన్స్ చేస్తూ ఆనందంలో మునిగిపోయారు. వారి కేరింతలతో జపాన్‌లోని గిఫు స్టేడియం మార్మోగిపోయింది.జపాన్‌లో జరిగిన ఆసియన్ గేమ్స్ 2026 ఫైనల్‌లో భారత అమ్మాయిలు 1-0 తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి చరిత్ర సృష్టించారు. తన 200వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న లాల్రెమ్సియామి 10వ నిమిషంలో అద్భుతమైన రివర్స్ స్టిక్ షాట్‌తో గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఈ ఒక్క గోలే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించింది.గోల్ చేసిన తర్వాత చైనా తీవ్రంగా ఎదురుదాడి చేసింది. భారత గోల్ పోస్ట్‌పై పదేపదే దాడులు చేసినా, మన డిఫెన్స్ గోడలా నిలబడింది. ముఖ్యంగా, కెప్టెన్, గోల్‌కీపర్ సవితా పూనియా కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టును కాపాడింది. చివరి నిమిషాల్లో చైనా తమ గోల్‌కీపర్‌ను కూడా బయటకు పంపి ఒత్తిడి పెంచినా, భారత అమ్మాయిలు సంయమనంతో ఆడి విజయాన్ని కాపాడుకున్నారు.ఈ విజయంతో భారత్ కేవలం పసిడి పతకాన్ని మాత్రమే గెలవలేదు. లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించి పెద్ద అడ్డంకిని అధిగమించింది. 1982 తర్వాత ఆసియా క్రీడల మహిళల హాకీలో భారత్‌కు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. గతంలో 1998, 2018లో ఫైనల్‌కు చేరినా రజత పతకాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కోచ్ స్జోర్డ్ మారిజ్నే వ్యూహాలు, కెప్టెన్ సలీమా టెటే నాయకత్వం ఈ చారిత్రక విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఈ గెలుపు భారత మహిళల హాకీలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది.

# దేశ ఫుట్ బాల్ చరిత్రలో రేపు అపూర్వ ఘట్టం.. బ్రెజిల్ తో భారత్ ఢీ.. ఎప్పుడు, ఎక్కడ

- ఫుట్‌బాల్ చరిత్రలో తొలిసారి బ్రెజిల్‌తో తలపడనున్న భారత జట్టు
- కోల్‌కతా సాల్ట్ లేక్ స్టేడియంలో శనివారం రాత్రి 7:30 గంటలకు మ్యాచ్
- 5వ ర్యాంక్ బ్రెజిల్‌కు, 138వ ర్యాంక్ భారత్‌కు మధ్య ఈ పోరు
- గాయం కారణంగా బ్రెజిల్ స్టార్ ఆటగాడు రాఫిన్హా మ్యాచ్‌కు దూరం
- పనామాతో డ్రా చేసి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతున్న బ్లూ టైగర్స్



భారత ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టానికి రంగం సిద్ధమైంది. ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ బ్రెజిల్‌తో భారత సీనియర్ పురుషుల జట్టు రేపు చరిత్రాత్మక స్నేహపూర్వక మ్యాచ్‌లో తలపడనుంది. కోల్‌కతాలోని ప్రఖ్యాత సాల్ట్ లేక్ స్టేడియం వేదికగా శనివారం (అక్టోబరు 3) రాత్రి 7:30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. భారత సీనియర్ జట్టు, బ్రెజిల్ సీనియర్ జట్టు ముఖాముఖిగా పోటీపడటం ఇదే మొదటిసారి కావడం విశేషం.ఫిఫా ర్యాంకింగ్స్ ప్రవేశపెట్టిన తర్వాత భారత జట్టు ఎదుర్కోబోతున్న అత్యంత బలమైన జట్టు ఇదే. ప్రస్తుతం బ్రెజిల్ 5వ ర్యాంకులో ఉండగా, భారత్ 138వ స్థానంలో ఉంది. గతంలో 1995లో 9వ ర్యాంకర్‌గా ఉన్న రష్యా, 1998లో అదే ర్యాంకులో ఉన్న జపాన్‌లతో భారత్ తలపడింది. ఇప్పుడు అంతకంటే బలమైన బ్రెజిల్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమైంది.ఇటీవల 44వ ర్యాంకులో ఉన్న పనామాతో జరిగిన మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకోవడం భారత జట్టుకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది. ఆ మ్యాచ్‌లో రాయన్ విలియమ్స్ గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన భారత్, పటిష్ఠమైన రక్షణతో బలమైన ప్రత్యర్థిని నిలువరించింది.మరోవైపు, 2026 ప్రపంచకప్‌లో నార్వే చేతిలో ఓటమి తర్వాత బ్రెజిల్ జట్టు ఓటమి ఎరుగకుండా ముందుకు సాగుతోంది. కోచ్ కార్లో అన్‌సెలొట్టి శిక్షణలో ఇప్పటివరకు 19 మ్యాచ్‌లు ఆడి 11 విజయాలు సాధించింది. అయితే, తొడ కండరాల గాయం కారణంగా ఆ జట్టు స్టార్ ఆటగాడు రాఫిన్హా ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు.ాూాూభారత ఫుట్‌బాల్‌కు, బ్రెజిల్‌కు మధ్య అనుబంధం ఎప్పటినుంచో ఉంది. 1977లో ఫుట్‌బాల్ దిగ్గజం పీలే కోల్‌కతాలో మోహన్ బగాన్‌తో ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడాడు. ఇప్పుడు బ్రెజిల్ సీనియర్ జట్టు తొలిసారిగా భారత్‌లో అడుగుపెడుతోంది. పెరూ, ఉరుగ్వే తర్వాత భారత్ ఎదుర్కోనున్న మూడో దక్షిణ అమెరికా దేశం బ్రెజిల్ కావడం గమనార్హం.

# భారత హాకీ అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు.. వెనక్కి పంపిన కమిటీ!

- భారత హాకీ అధికారి గుర్వీందర్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు
- జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల నుంచి వెనక్కి పంపివేత
- మలేషియా మహిళా అధికారితో పాటు హోటల్ సిబ్బంది నుంచి ఫిర్యాదులు
- నివేదిక వస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసిన హాకీ ఇండియా
- గతంలోనూ అతనిపై ఇలాంటి ఆరోపణలు



జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొన్న భారత హాకీ అంపైర్, టెక్నికల్ అధికారి గుర్వీందర్ సింగ్ సంఘాను టోర్నీ మధ్యలోనే స్వదేశానికి పంపించారు. ఆయనపై లైంగిక వేధింపుల ఫిర్యాదులు రావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ క్రీడల కోసం ఆసియా హాకీ ఫెడరేషన్ (ఏహెచ్ఎఫ్) సంఘాను అంపైర్ మేనేజర్‌గా నియమించింది. అయితే, మలేషియాకు చెందిన ఒక మహిళా హాకీ అధికారి ఆయనపై లైంగిక వేధింపుల ఫిర్యాదు చేశారు. శిక్షణ (మెంటరింగ్) పేరుతో సంఘా తన పట్ల అనుచితంగా ప్రవర్తించారని, అసభ్యంగా తాకారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనితో పాటు, అంపైర్లు బస చేసిన హోటల్ సిబ్బందితోనూ ఆయన దురుసుగా ప్రవర్తించినట్లు మరో ఫిర్యాదు అందింది.ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 30వ తేదీనే సంఘా నగోయా నుంచి వెనుదిరిగాడు. ఈ ఉదంతంపై హాకీ ఇండియా స్పందిస్తూ, "ఏహెచ్ఎఫ్ నుంచి ప్రతికూల నివేదిక అందిన పక్షంలో అతనిపై కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎటువంటి సందేహం లేదు. అతను దోషిగా తేలితే విడిచిపెట్టే ప్రసక్తే లేదు" అని హాకీ ఇండియా అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు.54 ఏళ్ల గుర్వీందర్ సింగ్‌పై గతంలోనూ ఇటువంటి ఆరోపణలు రావడం గమనార్హం. 2025లో రాంచీలో జరిగిన హాకీ ఇండియా లీగ్ సందర్భంగా ఒక మహిళా అంపైర్ ఆయనపై ఫిర్యాదు చేశారు.

# హాలీవుడ్ రేంజ్‌లో ఎన్టీఆర్ 'డ్రాగన్'.. గూస్‌బంప్స్ తెప్పించే మూడు యాక్షన్ బ్లాక్స్!

టాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'డ్రాగన్'. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ప్రశాంత్ నీల్ సినిమాలంటేనే విజువల్ వండర్స్, ఎమోషనల్ డెప్త్ మరియు గూస్‌బంప్స్ తెప్పించే యాక్షన్ ఎపిసోడ్స్ ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. అయితే ఈసారి 'డ్రాగన్' కోసం నీల్ ఆ అంచనాలకు మించి రెట్టింపు స్థాయిలో యాక్షన్ ప్లాన్ చేసినట్లు సమాచారం. కేవలం సాధారణ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లా కాకుండా, హాలీవుడ్ స్థాయి సాంకేతిక విలువలతో విజువల్ విందుగా ఈ చిత్రాన్ని మలచడానికి చిత్ర యూనిట్ చాలా శ్రమిస్తోంది. ముఖ్యంగా సినిమాలో ప్రత్యేకంగా డిజైన్ చేసిన మూడు భారీ యాక్షన్ బ్లాక్స్ ఈ చిత్రానికి ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. ప్రతి ఫైట్ సీక్వెన్స్‌కు బలమైన భావోద్వేగ నేపథ్యం ఉండేలా ప్రశాంత్ నీల్ ఈ సన్నివేశాలను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. సినిమా ప్రారంభంలో వచ్చే జైల్ ఫైట్ గురించి ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ చర్చ నడుస్తోంది. అత్యంత క్లిష్టమైన సెట్టింగుల మధ్య, భారీ హంగులతో తెరకెక్కించిన ఈ సీక్వెన్స్ ప్రేక్షకులను సీట్లలో కదలకుండా కట్టిపడేయడం ఖాయమని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఇక చిత్రంలోనే అత్యంత శక్తివంతమైన ఎపిసోడ్‌గా కాళీమాత ప్రాంగణం ఫైట్ నిలవబోతోంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్, ఆర్ట్ డిపార్ట్‌మెంట్ సృష్టించిన మ్యాజిక్ ఈ ఫైట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లనున్నాయి. కాళీమాత ప్రాంగణం నేపథ్యంలో వచ్చే ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్ మాస్ అండ్ రౌద్ర రూపం థియేటర్లలో ప్రేక్షకులకు పూనకాలు తెప్పించడం పక్కా. అలాగే ఈ మూడు యాక్షన్ బ్లాక్స్‌లో అత్యంత క్రూరమైన మరియు భావోద్వేగంతో కూడిన బ్లడ్ ఫైట్ ఎపిసోడ్ సినిమాకే అసలైన హైలైట్‌గా నిలవబోతున్నట్లు సమాచారం. ఇది సాధారణ పోరాటంలా కాకుండా ఒక సర్వైవల్ వార్ లా సాగుతుంది. ప్రశాంత్ నీల్ తనదైన శైలిలో రక్తపుటేరులు పారేలా, ప్రతి ఫ్రేమ్‌లోనూ ఇంటెన్సిటీ మిస్ కాకుండా దీన్ని రూపొందించారు. ఈ మూడు భారీ యాక్షన్ బ్లాక్‌లు సినిమా రన్టైమ్‌లో కీలక మలుపులుగా నిలుస్తూ, కథను పరుగులు పెట్టించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని సమాచారం. వెండితెరపై ఈ విజువల్ వండర్‌ను చూస్తున్నప్పుడు ప్రేక్షకులు మైమరచిపోవడం ఖాయమనే మాట బాక్సాఫీస్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది.






# బాక్సాఫీస్ వద్ద దసరా పోరు.. 'ది ప్యారడైజ్' బాటలో 'రణబాలి'!

సినిమా రంగంలో బాక్సాఫీస్ లెక్కలు ఎప్పుడూ మారుతాయన్న సంగతి తెలిసిందే. ఒక సినిమా సాధించిన విజయాలు లేదా రికార్డులు తదుపరి సినిమాలకు ఒక బెంచ్‌మార్క్‌గా మారుతుంటాయి. తాజాగా నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన 'ది ప్యారడైజ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌లను నమోదు చేసి సంచలనం సృష్టించింది. ఈ సినిమాకు ఒక వైపు నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, కేవలం నాలుగు రోజుల్లోనే ఈ సినిమా రూ. 155 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు యూనిట్ వర్గాలు వెల్లడించాయి. ఇక నాని కెరీర్‌లో ఇటువంటి భారీ వసూళ్లు సాధించడం ఆయన స్టార్‌డమ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లినట్లు ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో అదే బాక్సాఫీస్ సెంటిమెంట్‌ను రిపీట్ చేయడానికి టాలీవుడ్ మరో భారీ చిత్రంతో సిద్ధమవుతోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రణబాలి'. స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో, ఆ కాలంలోని కరువు పరిస్థితుల సృష్టితో పాటు ఒక సరికొత్త ఆత్మకథాత్మక లేదా మిస్టరీ అంశంతో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం అత్యంత భారీ ఎత్తున విడుదలకు ముస్తాబవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్లు, డాక్యుమెంటరీ సిరీస్ వీడియోలు మరియు పోస్టర్లు ఈ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. 'ది ప్యారడైజ్' సినిమాకు ఏ విధంగానైతే బలమైన పాజిటివ్ బజ్ క్రియేట్ అయిందో, 'రణబాలి' విషయంలోనూ మేకర్స్ అదే వ్యూహంతో విజయవంతమయ్యారు. ఈ చిత్ర దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ గత చిత్రాలైన 'టాక్సీవాలా', 'శ్యామ్ సింగరాయ్' విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను అలరించాయి. ఆయన నుంచి వస్తున్న మరో పీరియాడికల్ డ్రామాపై భారీ అంచనాలు ఉండటంలో ఆశ్చర్యం లేదు. మరోవైపు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట తెరపై కనిపించనుండటం, ముఖ్యంగా వీరిద్దరి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి 'యూ/ఏ' (ఖ/ూా) సర్టిఫికెట్ లభిస్తే, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా పెద్ద ఎత్తున థియేటర్లకు క్యూ కట్టే అవకాశం ఉంది. దసరా సెలవుల జోరుతో 'రణబాలి' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి. ఇక త్వరలోనే విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌తో ప్రస్తుత హైప్ మరింత రెట్టింపు కావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఎదురుచూపులకు తెర.. 'హనుమాన్ అంశ్' తెలుగు రిలీజ్ డేట్ ఫిక్స్!




కేవలం రూ. 1.8 కోట్ల చిన్న బడ్జెట్‌తో తెరకెక్కి ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిత్రం 'హనుమాన్ అంశ్'. ఈ సినిమాను తెలుగులో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అనౌన్స్‌మెంట్ అయితే చేశారు కానీ ఇప్పటివరకు ఎటువంటి అప్‌డేట్ లేదు. అయితే తాజాగా ఈ సినిమా విడుదలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలింస్ ఈ చిత్రాన్ని తెలుగులో అక్టోబర్ 9న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి ఈ సినిమా తెలుగు వెర్షన్ సెప్టెంబర్ 18నే విడుదల కావాల్సి ఉంది. అయితే త్రివిక్రమ్ శ్రీనాథ్ తన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్ ద్వారా ఈ రిలీజ్ నుండి తప్పుకోవడం, హైదరాబాద్‌లో జరగాల్సిన తెలుగు టీజర్ లాంచ్ ఈవెంట్ రద్దు కావడంతో ఈ సినిమా తెలుగు విడుదల కొద్ది రోజులు వాయిదా పడింది. తాజాగా హోంబలే ఫిలింస్ రంగంలోకి దిగి తెలుగు రిలీజ్ బాధ్యతలను తీసుకుంది. విశాల్ చతుర్వేది దర్శకత్వంలో నీమ్ కరోలి బాబా జీవిత చరిత్ర ఆధారంగా ఆధ్యాత్మిక డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం, ఇప్పటికే రూ. 400 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. శోభినావ్ సత్య నేమ్ కరోలి బాబా పాత్రలో నటించిన ఈ డివైన్ డ్రామా అక్టోబర్ 9న తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

# మోహన్‌లాల్‌తో నటించడం ఆశీర్వాదం.. భాగ్యశ్రీ బోర్సే ఎమోషనల్ పోస్ట్ వైరల్



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి భాగ్యశ్రీ బోర్సే ఇప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఆపరేషన్ గంగా' సినిమాతో ఆమె మాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. తాజాగా మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసిన భాగ్యశ్రీ.. ఆయనతో కలిసి పనిచేస్తున్న అనుభవాన్ని వివరిస్తూ రాసిన మాటలు ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మోహన్‌లాల్‌తో కలిసి నటించడం తనకు ఆశీర్వాదంగా భావిస్తున్నానని భాగ్యశ్రీ పేర్కొన్నారు. షూటింగ్‌లో ప్రతి రోజూ ఆయన నుంచి ఎంతో నేర్చుకుంటున్నానని, ఆయన చూపు ద్వారా సినిమాను మరో కోణంలో చూడగలుగుతున్నానని తెలిపారు. మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఫొటోను పంచుకున్న భాగ్యశ్రీ.. ఆయనపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. మోహన్‌లాల్‌కు సహనటిగా ఉండటం తనకు ఒక ఆశీర్వాదంలా అనిపిస్తోందని తెలిపారు.ప్రతి రోజు షూటింగ్‌లో ఆయనను చూస్తూ సినిమాను ఎలా చూడాలో నేర్చుకుంటున్నానని, ఆయనలో ఉన్న ప్రతిభ నిజంగా అద్భుతమని ప్రశంసించారు. ఒక సీనియర్ నటుడితో కలిసి పనిచేసే అవకాశం రావడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని ఆమె పేర్కొన్నారు. భాగ్యశ్రీ చేసిన ఈ పోస్టు మోహన్‌లాల్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. కొత్త నటి తన సహనటుడైన మోహన్‌లాల్ గురించి ఇంత ఆప్యాయంగా, గౌరవంగా మాట్లాడటంపై అభిమానులు స్పందిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే 'ఆపరేషన్ గంగా' సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంలో ఆమె మోహన్‌లాల్‌తో కలిసి నటిస్తున్నారు. తెలుగులో ఇప్పటికే సినిమాలు చేసిన భాగ్యశ్రీకి ఈ చిత్రం మరో ముఖ్యమైన అవకాశం అని చెప్పొచ్చు. విష్ణు మోహన్ దర్శకత్వం వహిస్తున్న 'ఆపరేషన్ గంగా' సినిమాకు సంబంధించిన జార్జియా షెడ్యూల్ తాజాగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో మోహన్‌లాల్, భాగ్యశ్రీ బోర్సేతో పాటు బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ కూడా షూటింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం. ఈ సినిమా 2022లో రష్యా--ఉక్రెయిన్ యుద్ధ సమయంలో ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకురావడానికి భారత ప్రభుత్వం చేపట్టిన తరలింపు కార్యక్రమం నేపథ్యంలో తెరకెక్కుతోంది.ఆ సమయంలో వేలాది మంది భారతీయులు ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయారు. వారిని సురక్షితంగా భారత్‌కు తీసుకురావడానికి చేపట్టిన భారీ తరలింపు చర్యలే ఈ సినిమాకు ప్రధాన నేపథ్యంగా నిలవనున్నాయి.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040